
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

శనివారం 27 ఏప్రిల్ 2024

రైల్వేకోడూరులో మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్.. పక్కన మాజీ సీఎం చంద్రబాబు నాయుడు (ఫైల్‌ఫొటో)



ప్రజాగళం.. విజయవంతం..

- చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లకు బ్రహ్మరథం
- ఏకతాటిపైకి కూటమి నాయకులు
- కూటమిలో గెలుపుపై ధీమా
- ముఖ్య నాయకులకు సమన్వయ బాధ్యతలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు, జనసేన సారధి పవన్‌కళ్యాణ్‌లు జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో గురువారం సాయంత్రం నిర్వహించిన ప్రజాగళం ఎన్నికల ప్రచార సభలు పూర్తి స్థాయిలో విజయవంతమయ్యాయి. ఇరువురు నాయకులకు జిల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా వేలాదిమంది ప్రజలు సభలకు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరు కావడం విశేషం. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మాజీ సీఎం, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిల ప్రసంగాలు పూర్తయ్యేంత వరకు సభకు హాజరైన వారు అక్కడి నుంచి కదలకపోవడం విశేషం. టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడిన ఈ సభలకు పెద్ద ఎత్తున ముస్లింలు హాజరై సభ పూర్తయ్యేంత వరకు వెళ్లిపోకుండా నాయకుల ప్రసంగాలు పూర్తిగా వినడం పట్ల కూటమి నాయకులు సంబరపడిపోతున్నారు. సభల అనంతరం చంద్రబాబుతో సమావేశం తర్వాత జిల్లాలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఏకతాటిపైకి వచ్చారు. దీంతో కూటమిలో రాజంపేట, రైల్వేకోడూరు, రాజంపేట పార్లమెంటు స్థానాల్లో గెలుపుపై ధీమా కనిపిస్తోంది. అదే సమయంలో ప్రజల్లో ఉన్న స్పందనను గమనించిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఎలాగైనా గెలిచి తీరాలన్న లక్ష్యంతో జిల్లాలోని ముఖ్యనాయకులకు సమన్వయ బాధ్యతలు అప్పగించారు. పలువురు నాయకులను పిలిపించి అభ్యర్థుల గెలుపు కోసం క్రియాశీలకంగా పనిచేయాలని ఆదేశించారు. టీడీపీలో మరికొందరు నాయకులకు రాష్ట్ర స్థాయి పదవులు కట్టబెట్టారు.. వెరసి బహిరంగ సభలు విజయవంతం కావడం పట్ల కూటమిలో గెలుపుపై ధీమా కనపడుతోంది.



రైల్వేకోడూరులో ప్రజాగళం సభకు హాజరైన ప్రజలు

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లకు బ్రహ్మరథం

ప్రజాగళం పేరుతో జిల్లాకు ఎన్నికల పర్యటనకు వచ్చిన చంద్ర బాబు, పవన్‌కళ్యాణ్‌లకు జిల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రాజంపేటలో సాయంత్రం 4.30 గంటలకు బహిరంగ సభ మొదలైంది. అప్పటికి ఇంకా ఎండ విపరీతంగానే ఉంది. అయినా జనం విపరీతంగా హాజరయ్యారు. అందులో మహిళలు అధిక సంఖ్యలో ఉండడం విశేషం. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపైన చేసిన విమర్శలకు జనం నుంచి అనూహ్య స్పందన లభించింది. దుర్మార్గమైన జగన్ ప్రభుత్వాన్ని అణగదొక్కాలని, ఎర్రచందనం స్మగ్లర్లకు ఎన్నికల్లో టికెట్లు ఇచ్చారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నప్పుడు జనం నుంచి విపరీతమైన స్పందన లభించింది. జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కొడుకు ఎంపీ మిధున్‌రెడ్డి, తమ్ముడు ద్వారకనాథరెడ్డిలు జిల్లాను దోచుకుంటున్నారని, వాళ్లను ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలన్నప్పుడు జనం చప్పట్లు, ఈలలతో మద్దతు తెలిపారు. రాత్రి 8 గంటల సమయంలో రైల్వేకోడూరులో జరిగిన బహిరంగ సభకు విపరీతంగా జనం హాజరయ్యారు. తిరుపతి మార్గంలోని మామిడికాయల మండీల నుంచి సభ జరిగిన వేదిక వరకు రోడ్డుపైన జనం కిక్కిరిసిపోయారు. ఒకానొక దశలో తొక్కిసలాట జరిగింది. ఇక్కడ సైతం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల ప్రసంగానికి జనం నుంచి విపరీతమైన స్పందన లభించింది. నాయకుల ప్రసంగం పూర్తయ్యే వరకు జనం కట్టుకదలకుండా విన్నారు. యువత, మహిళలు పెద్ద సంఖ్యలో ఈ సభకు హాజరయ్యారు. ఈ నేపధ్యంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు పాల్గొన్న సభలు విజయవంతం కావడం పట్ల కూటమి నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సభ విజయవంతం కావడంతో కూటమిలో గెలుపుపై ధీమా కనిపిస్తోంది.

ఏకతాటిపైకి కూటమి నాయకులు

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు జిల్లా, స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజల్లో కూటమి పట్ల సానుకూల వాతావరణం కనిపిస్తోందని, దానిని ఒడిచి పట్టుకోవాలని కూటమి నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాజంపేట అసెంబ్లీ స్థానంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, టికెట్టును ఆశించిన జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, పోలి సుబ్బారెడ్డితో పార్టీ రాష్ట్ర నాయకులు వేమన సతీశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల శ్రీవాణి, జనసేన నాయకుడు శ్రీనివాసరాజు, బీజేపీ నాయకుడు సాయిలోకేశ్‌తో పాటు స్థానికంగా ఉన్న పలువురు ముఖ్యమైన టీడీపీ నాయకులు, జనసేన, బీజేపీ నాయకులు ఏకతాటిపైకి వచ్చారు. ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థిని గెలిపించే లక్ష్యంతో కృషి చేస్తున్నారు. రైల్వేకోడూరులో సైతం కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ గెలుపు కోసం పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకుడు కస్తూరి విశ్వనాధనాయుడుతో పాటు పలువురు టీడీపీ సీనియర్ నాయకులు, జనసేన నాయకులతో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. అభ్యర్థిని గెలిపించేందుకు సమిష్టిగా, సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ నేపధ్యంలో టీడీపీ, జనసేన అధినేతల పర్యటన విజయవంతం కావడంతో.. జిల్లాలో కూటమిలో నూతనోత్సాహం కనిపిస్తోంది.

ఇద్దరికి రాష్ట్ర స్థాయి పదవులు

- తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మల్లెల శ్రీవాణి
- రాష్ట్ర కార్యదర్శిగా మహేశ్‌నాయుడు



మల్లెల శ్రీవాణి



మహేశ్‌నాయుడు

చంద్రబాబు జిల్లా పర్యటనలో ఉండగానే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు రాజంపేట నియోజకవర్గ పరిధిలోని ఇద్దరు నాయకులకు రాష్ట్రస్థాయి పదవులు ప్రకటించారు. సుండుపల్లె మండలానికి చెందిన చప్పిడి మహేశ్‌నాయుడును రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. రాజంపేట పట్టణానికి చెందిన మునిసిపల్ మాజీ చైర్మన్ మల్లెల శ్రీవాణిని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమించారు. ఇటీవలే టీడీపీ నాయకులు పోలి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి దాదాపు 100 మంది నాయకులు టీడీపీలో చేరారు. దీంతో ఇప్పటికే రాజంపేటలో కూటమి గెలుపు ఖాయమనే ప్రచారం ముమ్మరంగా ఉంది. దీనికి తోడు గురువారం జరిగిన ప్రజాగళం సభ కూడా విజయవంతమైంది. ఈ నేపధ్యంలో గెలిచేందుకు ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోకూడదనే ఉద్దేశ్యంతో టీడీపీ మహేశ్‌నాయుడు, శ్రీవాణిలకు రాష్ట్ర స్థాయి పదవులు కట్టబెట్టింది.

కరెన్సీ నోట్ల అమ్మవారు

- అమ్మవారికి విశేష అలంకరణ



పీటీఎం శివాలయంలో కరెన్సీ నోట్లతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 26 : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పీటీఎంకు చెందిన ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో లక్ష్మీ అమ్మవారిని కరెన్సీ నోట్ల తో విశేషంగా అలంకరించారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో సుందరంగా అలంకరించి అమ్మవారికి అష్టోత్తరమంత్రం, దేవీఖడ్గమాల, అన్నపూర్ణా అష్టోత్తర మంత్రం, కుంకుమార్చన, పంచహారతి, సప్తహారతి, మహామంగళహారతి కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమాల్లో పీటీఎంతో పాటు సమీప గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

- రాజంపేట పార్లమెంట్‌కు 13 నామినేషన్లు తిరస్కరణ

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 26 : రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ ఆధ్వర్యంలో నామినేషన్ల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. రాజంపేట పార్లమెంట్‌కు సంబంధించి 33 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా పత్రాలు సరిగ్గా లేని 13 మంది నామినేషన్లు తిరస్కరించగా 20 మంది నామినేషన్లను ఆమోదించారు. రాజంపేట నియోజకవర్గానికి సంబంధించి 25 మందికి గాను 11 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించగా 14 మంది నామినేషన్లను ఆమోదించారు. రాయచోటి నియోజకవర్గానికి సంబంధించి 24 మంది అభ్యర్థులకు గాను 6 మందివి తిరస్కరించగా 18 మంది నామినేషన్లను ఆమోదించారు. తంబళ్లపల్లెలో 19 మంది అభ్యర్థులకు గాను 7 మందివి తిరస్కరించగా 12 మంది నామినేషన్లను ఆమోదించారు. పీలేరు నియోజకవర్గానికి సంబంధించి 15 మంది అభ్యర్థులకు గాను పత్రాలు సరిగ్గా లేని ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించగా 12 మందివి ఆమోదించారు. మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి 19 మంది నామినేషన్లు వేయగా పత్రాలు సరిగ్గా లేని నలుగురు అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించగా 15 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. రైల్వేకోడూరులో 33కు గాను 12 తిరస్కరించగా 21 నామినేషన్లను ఆమోదించారు.

పత్రం.. పుష్పం సమర్పయామి..

- కోదండరాముడికి వైభవంగా పుష్పయాగం



కోదండరాముడికి పుష్పయాగం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 26 : కోదండరామస్వామివారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం పుష్పయాగ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం వైభవంగా ప్రారంభమైంది. తులసీదళాలు, మల్లెలు, రోజా, చామంతి, గన్నేరు, సంపంగి, మొగలిదలం తదితర పుష్పాలు, పత్రాలతో స్వామి, అమ్మవారికి పుష్పనీరాజనం సమర్పించారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి రెండు టన్నుల పుష్పాలు విరాళంగా అందాయి. ప్రకృతి వైపరీత్యాల నుంచి భక్తులను కాపాడాలని స్వామి వారిని ప్రార్థిస్తూ భూమాతను ప్రసన్నం చేసుకునేందుకు శ్రీవైష్ణవాలయంలో పుష్పయాగం నిర్వహిస్తారు. అదే విధంగా బ్రహ్మోత్సవాల్లో గానీ, నిత్యకైంకర్యాల్లో గానీ తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ యాగం నిర్వహణ వల్ల సమస్త దోషాలు తొలగిపోతాయని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



హాజరైన భక్తులు

ఎన్నికల ప్రచారంలో వలంటీర్‌లు

- వైసీపీ నేతలతో ఇంటింటి ప్రచారం
- వైసీపీ కండువాతో చిన్నగొల్లపల్లి వలంటీర్



వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అంజలి

స్టేట్ డైరెక్టర్ అజంతారాణితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ రవికుమార్‌నాయుడు



రాయచోటి (సుండుపల్లె), ఏప్రిల్ 26: సుండుపల్లె మండలంలోని గుండ్లపల్లె గ్రామ పంచాయతీ జేసీ కుర్వపల్లెలో గ్రామ వలంటీర్ అంజలి ఎన్నికల ప్రచారంలో శుక్రవారంపాల్గొన్నారు. స్టేట్ డైరెక్టర్ అజంతారాణి, వైసీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి వైసీపీకి ఓటు వేయాలని కోరారు. అలాగే చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీకి చెందిన వలంటీర్ రవికుమార్‌నాయుడు వైసీపీ నాయకులతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మండల నాయకులు గుండ్లపల్లి, సొరంవారిపల్లె గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తుండగా వైసీపీ కండువా వేసుకుని కరపత్రాలు పంచుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలను వలంటీర్లు ధిక్కరించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. అన్ని గ్రామాల్లో వలంటీర్లు ప్రచారాలు, సభలకు, నామినేషన్లకు హాజరవుతున్నా ఎందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



కన్నుపడితే.. కనపడదంతే..

- అధికార పార్టీ నాయకుల కబ్జా
- ప్రభుత్వ స్థలాలే వారి ఆదాయం
- కోట్లు కొల్లగొట్టారు
- జగన్ ప్రభుత్వంపై మండిపడుతున్న జనం



అప్పన్నకుంటలో నిర్మించిన అక్రమ కట్టడాలు

సుండుపల్లె, ఏప్రిల్ 26: దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు అధికార పార్టీ నేతలు ప్రభుత్వ స్థలాలను పంచుకున్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అరాచకాలు, అక్రమాలు, భూదందాలకు అధికార పార్టీ నేతలు తెరలేపారు. ఏ స్థాయి నేత ఆ స్థాయిలో దొరికిందంతా దోచేశారు. సుండుపల్లె మండల ప్రజలు నియోజకవర్గంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ రావడంలో కీలకపాత్ర పోషించారు. వైఎస్‌ఆర్ తనయుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంతో పాటు మనకు మంచి జరుగుతుందన్న ఆశతో ఇక్కడి ప్రజలు ఓటు వేశారు. ఓటు వేసిన ఏడాది గడవక ముందే వైసీపీ ప్రభుత్వం ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలిసి వచ్చింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు, చేసిన వాగ్దానాలు అన్నీ అధికారం కోసమేనని ప్రజలకు తెలిసి వచ్చింది. రాజు నీతివంతుడైతే రాజు కింద పనిచేసే మంత్రి, సామంతరాజులు, సైనికులు, భటులు కూడా నీతివంతులుగా ఉంటారనే సామెత ఒకటి ఉంది అనే విషయం ఈ ఐదేళ్లలో మండల ప్రజలకు స్పష్టంగా తెలిసి వచ్చింది. సుండుపల్లె మండలంలో 10 సంవత్సరాల నుంచి ఇంటి స్థలాలకు మంచి డిమాండ్ ఉంది. ఇంటి స్థలం కొనాలంటే సామాన్యులకు భారంగా మారింది. అయితే ఇంటి స్థలాలకు ఉన్న డిమాండును వైసీపీ నాయకులు పసిగట్టి ప్రైవేటు స్థలాలు, ప్రభుత్వ స్థలాలపై కన్ను వేశారు. అది అదునుగా రాష్ట్రమంతా ఏ విధంగా అయితే అధికారులు అధికార పార్టీ కనుసన్నల్లో పనిచేశారో అంతకు వంద రెట్లు సుండుపల్లె మండలంలో అన్ని శాఖల అధికారులు అధికార పార్టీ నాయకులు, నేతల కనుసన్నల్లో పనిచేశారు. ఇంకేముంది ఆడిందే ఆటగా పాడిందే పాటగా బ్రిటీష్ పాలనను తలపించేలా ప్రజలను భయభ్రాంతులను చేసి అక్రమాలు చేసి కోట్లు కొల్లగొట్టారు అనే విమర్శలు జోరుగా ఉన్నాయి. ప్రైవేటు భూములను పెండింగ్‌లో పెట్టించి మండల కేంద్రంలో బయట విలువైన భూములు కలిగిన వారి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి అధికార పార్టీ నేతలు పంచుకున్నారు. ఇదంతా మండలంలో క్రియాశీలకంగా పనిచేసిన నాయకులు నేతలతో పాటు నియోజకవర్గ నేతల ప్రమేయంతో అరాచకాలు పేట్రేగిపోయాయి. ఈ అరాచకాల నుంచి అన్ని రంగాల్లో విముక్తి ఉండాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు భావిస్తున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నపుడు ఇలాంటి అరాచకాలు ఎప్పుడూ జరగలేదని ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

2140 సర్వే నెంబరులో 1.25 ఎకరాలు

మండల కేంద్రానికి సమీపంలో పీలేరు ప్రధాన రహదారి పక్కన గత ప్రభుత్వంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ఏర్పాటు చేసి రెండు రూపాయలకే తాగునీరు అందించాలన్న సంకల్పంతో 2140 సర్వే నెంబర్‌లో తాగునీటి పథకం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అక్కడ ఉన్న 1.25 ఎకరాల ప్రభుత్వ స్థలం సుమారు కోటి రూపాయల విలువ చేస్తుంది. ఆ స్థలాన్ని అధికార పార్టీ కార్యకర్తలకు, నాయకులు అప్పనంగా అప్పజెప్పారు. ఒక్కొక్క ఇంటి స్థలానికి లక్ష నుంచి మూడు లక్షల వరకు వసూలు చేసి దొంగ పట్టాలను సృష్టించారనే విమర్శలు ఉన్నాయి. ఆ స్థలంలో ఎవ్వరికీ ఎటువంటి ఇంటి పట్టాలు మంజూరు చేయలేదని అది ప్రభుత్వ స్థలమేనని అప్పటి తహసీల్దార్ అధికారికంగా, రాతపూర్వకంగా ఇచ్చారు. ఈ ప్రదేశంలో తాగునీటి పథకం కోసం శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ బోరు కూడా వేశారు. ఇది ప్రభుత్వ స్థలమేనని ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, స్థానికులు వ్యతిరేకించినా కూడా అక్రమ కట్టడాలు ఆగలేదు. అంటే ఏ స్థాయిలో జగన్ పాలన విధ్వంసం సృష్టించిందో ప్రజలకు స్పష్టంగా తెలిసింది.

అప్పన్నకుంటలో అందాల మేడలు

మండల కేంద్రం నడిబొడ్డున అప్పన్నకుంట ఉంది. సుమారు 28.28 ఎకరాల విస్తీర్ణంలో ఆ కుంట దశాబ్దాల కాలం నుంచి రైతులకు సాగునీటి కోసం మండల కేంద్రంలో వందలాది కుటుంబాలకు తాగునీటి వసతిని కల్పించేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కుంటలో అందాల మేడలు దర్శనమిస్తున్నాయి. యథేచ్ఛగా చెట్లు తొలగించి ఆక్రమణలు చేస్తున్నా అధికారులు వచ్చి చూసీ చూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. స్థానికులు ఫిర్యాదు చేసినప్పుడు అక్కడికి వెళ్లి హడావుడి చేసేది అనంతరం దాని గురించి పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. అధికార పార్టీ నాయకులు కదా అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకుని అందాల మేడలను నిర్మించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంతమంది నిర్మించిన భవనాలను లక్షలాది రూపాయలకు అమ్ముకున్నారు. కొంతమంది ఆక్రమించి పునాదులు వేసి ఇతరులకు అమ్మేశారు. ఈ కుంటలోని ఆక్రమణలను కాపాడాలని గతంలో కొంతమంది అధికార పార్టీ నాయకులతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

మైనార్టీలే టార్గెట్

పేదల ప్రభుత్వం నా మైనార్టీలు నా దళితులు అని గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మైనార్టీల భూములే లక్ష్యంగా సుండుపల్లె మండలంలో ఆక్రమాల పర్వం కొనసాగింది. మండల కేంద్రంలో అధికంగా మైనార్టీలు ఉన్నారు. మైనార్టీలకు భూములు అధికంగా ఉండడంతో ఆ భూముల పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలను టార్గెట్ చేసి భూములను అమ్ముకున్న సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. మైనార్టీల మధ్య భూతగాదాలు సృష్టించి సెటిల్మెంట్లు చేసి అధికార పార్టీలోని బడా నేతలు కోట్లాది రూపాయలు వసూలు చేసి పంచుకున్నారు. కేకే కల్యాణ మండపం సమీపంలోని భూముల పంచాయితీతో ప్రారంభమైన వైసీపీ నాయకుల సెటిల్మెంట్లు మండలమంతా విస్తరించి సామాన్యుల నుంచి నోట్ల కట్టలను పోగు చేసుకున్నారు. ఈ వ్యవహారం అంతా కేవలం ధన దాహంతో అధికార మదంతో జరిగాయని మైనార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




ఎండార్స్‌మెంట్

	కోరిన సమాచారము	అందజేసిన సమాచారము
	[illegible]	[illegible]

సర్వే నెంబర్ 2140లో ఎటువంటి పట్టాలు ఇవ్వలేదని సమాచార హక్కు చట్టంలో ఇచ్చిన పత్రం

● శ్మశానవాటిక ఏర్పాటు చేస్తేనే ఓట్లు వేస్తాం



సిద్దవటం, ఏప్రిల్ 26: మండలంలోని కడపాయపల్లె హరిజనవాడ ప్రజలు గ్రామంలో ఓ చెట్టుకు ఏర్పాటు చేసిన బ్యానర్ చర్చనీయాంశంగా మారింది. అక్కడ నివసిస్తున్న ప్రజలకు శ్మశానవాటిక లేక పది సంవత్సరాల నుంచి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో మంది అధికారులకు విన్నవించినా ఏ మాత్రం ఫలితం లేకపోయిందని చివరికి ఓ చెట్టుకు బోర్డును ఏర్పాటు చేసి ఓట్లు కావాలంటే స్మశానం వాటిక ఏర్పాటు చేయాలని కొన్ని అంశాలను పొందుపరిచారు. ఈ విషయం చుట్టుపక్కల గ్రామాల్లో చర్చనీయాంశమైంది. నాయకులు వస్తూపోతూ ఉన్నారు తప్ప శ్మశానవాటిక ఏర్పాటు చేయలేదని తమ గ్రామంలో ఈ సమస్య పూర్తైతేనే ఓట్లు వేస్తామని ప్రజలు పేర్కొన్నారు. పది సంవత్సరాలకు పైగా కాలనీవాసులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి కాళ్లరిగిపోయాయని అయినా ఏ మాత్రం ఫలితం కనిపించలేదని ప్రజలు పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు శ్మశానవాటిక ఏర్పాటు చేసి చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలిగించాలని ప్రజలు పేర్కొంటున్నారు.



శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని చెట్టుకు బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

● ఇదేందయ్యా.. ఇది..!

● చెట్టు కింద పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటుపై మండిపాటు



పీలేరు, ఏప్రిల్ 26: "రోడ్డు పక్కన చెట్టు కింద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ఉపాధ్యాయు లను అవమానిస్తారా? ఏదైనా రాసుకోవడానికి కనీసం ఒక బెంచు కూడా ఏర్పాటు చేయరా? ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవం ఇదేనా" అంటూ పీలేరు మండలంలోని పలువురు ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులపై మండిపడ్డారు. పోస్టల్ బ్యాలెట్‌ల హెల్ప్ డెస్క్‌ను రోడ్డు పక్కన, ఓ చెట్టు కింద ఏర్పాటు చేయడం వారి ఆగ్రహానికి కారణమైంది. పోస్టల్ హెల్ప్‌డెస్క్‌ను గతంలో పీలేరు తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించేవారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి దాన్ని తహసీల్దారు కార్యాలయం వెలుపలికి తరలించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో తహసీల్దారు కార్యాలయంలోకి ఇతరులను అనుమతించరాదన్న ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అటు అధికారులు, ఇటు పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందిని తప్ప ఇతరులను కార్యాలయంలోనికి అనుమతించడం లేదు. దీంతో పోస్టల్ బ్యాలెట్ పొందిన ఉద్యోగులకు ఇబ్బంది అవుతున్నట్లు గ్రహించిన అధికారులు దాన్ని తహసీల్దారు కార్యాలయం గోడకు ఆనుకుని చెట్టు కింద ఏర్పాటు చేశారు. తమ దరఖాస్తుల కోసం వచ్చిన పలువురు ఉపాధ్యాయులు శుక్రవారం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఒక బెంచి, ఎండన పడి వచ్చిన వారు కూర్చోవడానికి కుర్చీ ఏర్పాటు చేయకపోవడం ఏమిటని వారు అసహనం వ్యక్తం చేశారు. రోడ్డు మీద కాకుండా తహసీల్దారు కార్యాలయానికి పక్కనే ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. నామినేషన్ల పరిశీలన కార్యక్రమం కూడా శుక్రవారం పూర్తయినందున ఈ విషయంపై ఆలోచించుకోవాలన్నారు.



పీలేరు తహసీల్దారు కార్యాలయం బయట చెట్టుకింద ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్


2021లో కొట్టుకుపోయిన పాపిరెడ్డిగారిపల్లె-మహల్ గ్రామాల మధ్యలో ఉన్న బాహుదా బ్రిడ్జి (ఫైల్)


ప్రమాదకరంగా మారిన పుట్టావాండ్లపల్లె బ్రిడ్జి

కూలిపోతేగానీ కొత్తవి కట్టరేమో...


పుట్టావాండ్లపల్లె బ్రిడ్జి వద్ద వాగులో పడిపోయిన టిప్పర్ (ఫైల్)


పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ నాలేవాండ్లపల్లె వద్ద పింఛా నదిపై ఉన్న లోలెవల్ వంతెన

● పీలేరు నియోజకవర్గంలో శిథిలావస్థలో పలు వంతెనలు
● పట్టించుకోని అధికార పార్టీ నేతలు, అధికారులు

పీలేరు/కలకడ/వాల్మీకిపురం, ఏప్రిల్ 26: రహదారులు, వంతెనలు నాగరికతకు చిహ్నాలు అంటారు. శిథిలావస్థకు చేరుకుని, ఇప్పుడో, ఇంకొంచెం సేపటికో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న బ్రిడ్జీలు వేటికి సంకేతాలో పాలకులే చెప్పాలి. పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలకడ, వాల్మీకిపురం మండలాల్లోని పలు బ్రిడ్జీలు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. వాటి గురించి ప్రజలు తమ దృష్టికి తెచ్చినప్పుడల్లా స్థానిక ఎమ్మెల్యేగానీ, ఎంపీగానీ అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేశారు తప్ప వాటి మరమ్మతులు గురించిగానీ, పునర్నిర్మాణం గురించి గానీ పట్టించుకోలేదు. పోనీ వాటి దుస్థితి గురించి వారికి తెలియదా అంటే తెలుసు. ఆయా గ్రామాలకు వెళ్లాల్సిన సమయంలో ఆ బ్రిడ్జీల మీదనే ప్రయాణించాలి. మరి అధికారంలో ఉండి కూడా వాటి గురించి ఎందుకు పట్టించుకోలేదో వారికే తెలియాలి. సామాన్య ప్రజలేమో అవి కూలిపోతేగానీ పాలకులు పట్టించుకోరేమో అని వాపోతున్నారు.

శిథిలావస్థలో గూడరేవుపల్లె వంతెనలు

పీలేరు మండలం గూడరేవుపల్లె వద్ద బడబళ్ల వంకపై ఉన్న బ్రిడ్జీ శిథిలావస్థకు చేరుకుని నేడో రేపో కూలిపోయేందుకు సిద్ధంగా ఉంటూ అటు వాహనదారులు, ఇటు అధికారులు, ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పీలేరు మండలంలోని అంతర్గత ప్రధాన రహదారుల్లో పీలేరు-తలపుల మార్గం ఒకటి. ఆ మార్గంలో గూడరేవుపల్లె, జాండ్ల, తలపుల, మేళ్లచెరువు గ్రామ పంచాయతీలు ఉండగా ఈ దారి గుండా పొరుగునే ఉన్న కేవీపల్లె మండలం జిల్లేళ్లమంద, కడప జిల్లా పింఛా, ఎర్రావారిపాళెం మండలంలోని యల్లమంద, బోడేవాండ్లపల్లె ప్రాంతాలకు చేరుకోవచ్చు. పీలేరు డిపోకు ఆదాయం తెస్తున్న అతికొద్ది మార్గాల్లో ఇదీ ఒకటి. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ మార్గాన్ని గూడరేవుపల్లె బ్రిడ్జి వణికిస్తోంది. ఎప్పుడో దశాబ్దాల క్రితం నిర్మించిన ఆ బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ఇప్పుడో, అప్పుడో కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. అధికార పార్టీకి చెందిన మండల కన్వీనరే గూడరేవుపల్లె సర్పంచ్‌గా ఉన్నా ఎందుకనో ఆ బ్రిడ్జి పునరుద్ధరణపై దృష్టి సారించలేదు. ఆ వంతెనపై ప్రతిరోజూ వేలాది సాధారణ వాహనాలతో పాటు మట్టి, ఇసుక టిప్పర్లు తిరుగుతుంటాయి. జాండ్ల, గూడరేవుపల్లె పంచాయతీ సరిహద్దుల్లోని పింఛా నది పరీవాహక ప్రాంతం నుంచి సేకరించిన ఇసుకను వందలాది ట్రాక్టర్లు, పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా ప్రతిరోజూ ఆ వంతెనపై నుంచి పీలేరు పట్టణానికి తరలిస్తుంటారు. అధిక బరువుతో ఉండే ట్రాక్టర్లు, టిప్పర్ల కారణంగా వంతెన రోజురోజుకీ బలహీనపడుతోందని, ఏ సమయంలో ఏం జరుగుతుందోనన్న భయం తమను వెంటాడుతోందని గూడరేవుపల్లె గ్రామస్థులు తెలిపారు. వారి భయాలకు ఆ బ్రిడ్జిపై అనునిత్యం జరుగుతున్న ప్రమాదాలు బలం చేకూరుస్తున్నాయి. ఆ బ్రిడ్జీపై ఎటువంటి సేఫ్టీ రెయిలింగ్స్ లేకపోవడంతో రెండు వేర్వేరు ఘటనల్లో రెండు ఆటోలు వాగులో బోల్తాపడి ఆటోడ్రైవర్లు ప్రాణాలు పోగొట్టుకున్నారు. 2022లో ఆ బ్రిడ్జీపై ఓ ప్రమాదం జరిగినప్పుడు అటు ప్రజాప్రతినిధులు, ఇటు ఆర్‌అండ్‌బీ అధికారులు కాస్త హడావిడి చేశారు తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇదే పంచాయతీ పరిధిలోని మరో బ్రిడ్జి కూడా ప్రమాదకరంగా మారింది. పీలేరు-రొంపిచెర్ల మార్గంలో పుట్టావాండ్లపల్లె వద్ద దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జి గత పదేళ్లుగా పెరిగిన భారీ వాహనాల తాకిడికి కూలిపోయేందుకు సిద్ధంగా మారింది. 2022 డిసెంబరు మాసంలో ఆ బ్రిడ్జిపై నుంచి ఓ టిప్పర్ బడబళ్లవంకలో పడిపోవడంతో అందరి దృష్టి ఆ బ్రిడ్జిపై పడింది. రియల్ ఎస్టేట్ వెంచర్లు అభివృద్ధి చేసుకునేందుకు పుట్టావాండ్లపల్లె ప్రాంతం నుంచి పీలేరుకు టిప్పర్ల ద్వారా మట్టిని తరలించుకునేందుకు ఆ బ్రిడ్జి అనుకూలంగా ఉండడంతో దానిపై రాకపోకలు పెరిగాయి. దీంతో అది బలహీనంగా మారింది. ఆ వంతెనపై రియల్టర్లే అప్పుడప్పుడు కాసిన్ని మరమ్మతులు చేసుకుని తమ పనికానిచ్చుకుంటున్నారు. 2022 డిసెంబరులో ఆ బ్రిడ్జీలను ఆర్‌అండ్‌బీ శాఖ ఈఈ అరవిందాదేవి స్వయంగా పరిశీలించి వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అవి ఇంతవరకు ఎందుకు కార్యరూపం దాల్చలేదో ఏలిన వారికే తెలియాలి. ఆ రెండు బ్రిడ్జీల వద్ద ఏదైనా పెద్ద ప్రమాదం జరగక ముందే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వంతెనలను బాగు చేయాలని గూడరేవుపల్లె గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఆ బ్రిడ్జీలకు మరమ్మతులు చేయాలని తాము ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, వారి ఆదేశాలు, నిధుల మంజూరు కోసం ఎదురుచూస్తున్నామని పీలేరు ఆర్‌అండ్‌బీ శాఖ డీఈ చంద్రశేఖర్ తెలిపారు. అదే విధంగా పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ పరిధిలోని నాలేవాండ్లపల్లె వద్ద నుంచి ఎనుములవారిపల్లెకు వెళ్లే మార్గంలో పింఛా నదిపై ఉన్న లోలెవల్ వంతెన పింఛా నదిలో నీటి ప్రవాహం పెరిగినప్పుడు ప్రమాదకంగా మారుతోంది. గతంలో అక్కడ పింఛా నది దాటుతూ ఓ జంట ప్రాణాలు పోగొట్టుకుంది. అదే పంచాయతీలో పీలేరు-సదుం మార్గంలోని మరో వంతెన కూడా శిథిలావస్థకు చేరుకుంది.

వాల్మీకిపురం మండలంలో...

వాల్మీకిపురం మండలంలోని మంచూరు గ్రామం వద్ద బాహుదా నది కాలువపై నిర్మించిన బ్రిడ్జి ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జి గుండా నిత్యం ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుండడం గమనార్హం. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ తూతూ మంత్రంగా అధికారులు చర్యలు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చేపట్టడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలకడలో కుంగిపోతున్న బాహుదా బ్రిడ్జి

కలకడ మండలం పాపిరెడ్డిగారిపల్లె, కలికిరి మండలం మహల్ గ్రామం మార్గమధ్యంలో బాహుదా నదిపై నిర్మించిన బ్రిడ్జి కుంగిపోతోంది. 2021లో నివర్ తుఫాను కారణంగా నదిలో నీరు ఉధృతంగా ప్రవహించి బ్రిడ్జి మధ్య భాగం నదిలో కొట్టుకుపోయింది. అప్పట్లో అధికార పార్టీ నాయకులు దానిని పూర్తిస్థాయి నిర్మాణంపై దృష్టి సారించలేదు. కొట్టుకుపోయిన ప్రాంతంలో తాత్కాలికంగా రాళ్లు, మట్టి వేయించి చేతులు దులుపుకున్నారు. అయితే కాలక్రమంలో బ్రిడ్జి సమీపంలో ఇసుక పూర్తిగా తోడేయడంతో అది ఓ పక్కకు ఒరిగిపోవడమే కాకుండా కొద్దికొద్దిగా కుంగిపోతోంది. ఆ బ్రిడ్జిపై నిత్యం టిప్పర్లు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండడంతో అది ఎప్పుడు కూలిపోతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఆ బ్రిడ్జీ ఉన్న మార్గం కలకడ, గుర్రంకొండ మండలాల ప్రజలు కలికిరి, తిరుపతి, చిత్తూరు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అనుకూలమైనది. కలికిరి మండలం మహల్, అద్దవారిపల్లె గ్రామాల ప్రజలు పొలాల వద్దకు సులువుగా చేరుకునేందుకు వీలుంది. ఆ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టని అధికార పార్టీ నేతల తీరుపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఫ్యామిలీ పాలిటిక్స్

మొన్నటి వరకూ ఆమె ఓ సంపన్న కుటుంబంలో గృహిణి. మూడు దశాబ్దాలుగా కుటుంబమంతా రాజకీయాల్లో తలమునకలవుతున్నా ఆమె మాత్రం కుటుంబ వ్యవహారాలకు మాత్రమే పరిమితమయ్యారు. ఎన్నికల్లో తన భర్త పోటీ చేస్తున్నా ప్రచారానికి దూరంగానే ఉంటూ పిల్లలూ, వారి చదువులూ, బాగోగులూ, కుటుంబ నిర్వహణ చూసుకునేవారు. దాదాపు 8 నెలల క్రితం జరిగిన ఒక సంఘటన ఆమె వ్యవహార శైలిని పూర్తిగా మార్చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన అంగళ్లులో చంద్రబాబుపై జరిగిన దాడి సంఘటనలకు సంబంధించి నమోదైన పోలీసు కేసులు ఆమెను ఇంటి గడప దాటేలా చేశాయి. ఆమె మరెవరో కాదు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి సతీమణి. అంగళ్లు కేసుల సందర్భంగా అనూహ్యంగా ఇంటి గడప దాటి బయటకొచ్చిన తనూజారెడ్డి ఇప్పుడు మొదటిసారి ఎన్నికల ప్రచారంలో కుమార్తె, కోడలుతో సహా పాల్గొంటున్నారు.


కోడలు షమారెడ్డితో కలిసి ప్రచారం చేస్తున్న తనూజారెడ్డి (ఫైల్)

మొదటిసారి ప్రజల్లోకి..

● భర్త కోసం తనూజా ప్రచారం ● కుటుంబ సభ్యులంతా భాగస్వామ్యం

కలికిరి, ఏప్రిల్ 26: నల్లారి తనూజారెడ్డి.. క్లుప్తంగా తనూజమ్మ.. ఎనిమిది నెలల క్రితం వరకూ ఆమె పేరు పెద్దగా ఎవరికీ తెలియదు. ముఖ పరిచయం ఉన్న వారు కూడా అంతంత మాత్రమే. అది 2023 ఆగస్టు 4వ తేదీ. చంద్రబాబు అంగళ్లు పర్యటన సందర్భంగా వైసీపీ మూకలు రాళ్లు రువ్వి నానా రభస సృష్టించారు. ఆపై చంద్రబాబుతో సహా మొత్తం 20 మందిపై 307 హత్యాయత్నం సహా పది సెక్షన్లతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో కిశోర్‌కుమార్‌రెడ్డిని కూడా చేర్చారు. ఇది కాకుండా విడిగా ఆయనపై మరో కేసు కూడా నమోదైంది. ఇదిలా ఉండగానే ఆ తరువాత టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలపై మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో ఏకంగా ఒక్క పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 137 మందిని ఇరికించేశారు. కేసుల విషయంలో బెయిళ్ల కోసం కిశోర్‌కుమార్‌రెడ్డి దాదాపు నెలన్నరగా విజయవాడలో మకాం వేశారు. స్థానికంగా కార్యకర్తలపై పోలీసుల వేధింపులు మొదలయ్యాయి. అరెస్టు కోసమంటూ ఈ 137 మంది ఇళ్లలో సోదాలు, ఆచూకీ తీయడాలు కూడా మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో ఇంటి వ్యవహారాలకే పరిమితమై హైదరాబాదులో ఉన్న తనూజారెడ్డికి నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలు అవగతమయ్యాయి. ఇక అనుకున్నదే తడవుగా నియోజకవర్గంలో వరుస పర్యటనలకు సంసిద్ధమయ్యారు. కేసుల్లో ఉన్న ప్రతి కుటుంబాన్ని పరామర్శించారు. పది రోజుల పాటు పరామర్శలతో వచ్చిన అనుభవాలతో ఆమె దాదాపు నియోజకవర్గమంతా మమేకమయ్యారు. ఆ తరువాత ఎన్నికలు కూడా రావడంతో ఆమె ఇంటింటి పర్యటనకు బయలుదేరారు. వీలైనన్ని గ్రామాల్లో ప్రతి ఇంటి గడప తొక్కాలని, ప్రతి తలుపూ తట్టాలనే సంకల్పంతో ఏకబిగిన ప్రచారం చేస్తున్నారు.

బిడ్డలతోనూ ప్రచారం

రోజు రోజుకూ తనూజారెడ్డి విశేషంగా ప్రచారం చేస్తున్నారు. తనతో పాటు కుమార్తె డాక్టర్ వైష్ణవి, కోడలు డాక్టర్ షమారెడ్డి కూడా ఇంటింటి ప్రచారం మొదలు పెట్టారు. ఇందులో ప్రధానంగా షమారెడ్డి ప్రచారం కూడా పట్టణాల్లో ప్రజల్ని బాగా ఆకట్టుకుంటోంది. ధారాళంగా హైదరాబాదు ఉర్దూ మాట్లాడంతో ముస్లిం మహిళలు, వృద్ధులతో కలిసిపోతున్నారు. మరోవైపు కుమారుడు డాక్టర్ నల్లారి అమరనాథరెడ్డి కూడా తల్లీ, చెల్లీ, సతీమణి కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ ప్రచారంలో వేగాన్ని పెంచుతున్నారు.

నాటి కడలూరే.. నేటి రైల్వేకోడూరు

● చుట్టూ ఏర్లు... మధ్యలో ఊరు ● ఒకప్పుడు వెయ్యి ఓటర్లు
● ప్రస్తుతం 2,01,544 మంది ఓటర్లు



రైల్వేకోడూరు, ఏప్రిల్ 26: నాడు కడలూరు అనే పేరుతో పేరుగాంచి నేడు రైల్వేకోడూరుగా మారింది. బ్రిటీష్ కాలంలోనే కడలూరు అని పిలిచేవారు. చుట్టూ ఏర్లు.. మధ్యలో ఊరు ఉంది. అప్పుడు వెయ్యి మంది ఓటర్లు, 1500 మంది జనాభా ఉండేవారు. ప్రస్తుతం 2,01,544 మంది ఓటర్లు ఉన్నారు. చిన్న పల్లెటూరు ఉన్న కడలూరు గ్రామం నేడు పెద్దగా విస్తరించింది. 1866 బ్రిటీష్ కాలంలో కడలూరు రైల్వేస్టేషన్ నిర్మాణానికి నోచుకుంది. తర్వాత కడలూరు కాస్త ఇక్కడ రైల్వేస్టేషన్ ఏర్పాటు కావడంతో రైల్వేకోడూరుగా మారింది. కడలూరుగా ఉన్న కాలం నుంచి ఇక్కడ పండించే మామిడి, అరటి, నిమ్మ తదితర పంటలకు ఆలవాలం. ఎక్కువగా రైళ్లలోనే రైతులు, వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. పంట పూర్తయిన తర్వాత రైళ్లలో వ్యాపారులు, రైతులు కలసి ఇతర రాష్ట్రాల్లో ఉన్న మార్వాడీల వద్దకు వెళ్లేవారు. తాము పంపిన సరుకు లెక్కలు వేసుకుని బంగారు నగలు తెచ్చుకునే వారని సీనియర్ సిటిజన్లు చెబుతున్నారు. కడలూరు గ్రామంలో ప్రజలు ఏకతాటిపై ఉండేవారని సీనియర్ సిటిజన్లు చెబుతున్నారు.

మోదీ సభకు స్థల పరిశీలన

కలికిరి, ఏప్రిల్ 26: పీలేరు నియోజకవర్గంలో ప్రధాని మోదీ ఎన్నికల పర్యటనల్లో భాగంగా పీలేరు నియోజకవర్గంలో బహిరంగ సభ తేదీ ఖరారయ్యింది. మే 3వ తేదీ మధ్యాహ్నం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి తరఫున జరిగే బహిరంగ సభకు మోదీ హాజరుకానున్నట్లు బీజేపీ వర్గాల ద్వారా తెలిసింది. దీనికి తగ్గట్లు సభా ప్రాంగణం కోసం సరిపడా స్థలాన్ని ఎంపిక చేయడానికి నాయకులు శుక్రవారం ప్రయత్నాలు ప్రారంభించారు. కలికిరి సమీపంలో సీఆర్‌పీఫ్‌కు వెళ్లే దారిలో వున్న స్థలాన్ని బీజేపీ, టీడీపీ అభ్యర్థులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్‌లు పరిశీలించారు. ప్రధాని ప్రోటోకాల్‌కు అనుగుణంగా స్థలం సరిపోతుందా, చాలకపోతే దాని చుట్టుపక్కల స్థలాన్ని ఎంత వరకూ కలుపుకోవచ్చుననే అంశాల గురించి చర్చించారు. అంతకు ముందు పీలేరు పట్టణ శివార్లలో అనుకూలంగా వున్న స్థలాలను కూడా ఈ సందర్భంగా పరిశీలించారు. ఇందులో భాగంగా ఫిబ్రవరిలో జరిగిన చంద్రబాబు సభా ప్రాంగణాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. సభా ప్రాంగణానికి అనువైన స్థలం ఎంపిక కోసం ఇంకా ఒకటి రెండు చోట్ల పరిశీలించనున్నట్లు తెలుస్తోంది.


కలికిరిలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న కిరణ్‌కుమార్ రెడ్డి, కిశోర్‌కుమార్ రెడ్డి, సాయిలోకేశ్

ఆంధ్రజ్యోతి
కడప
జన కేతనం
శనివారం 27 ఏప్రిల్ 2024
www.andhrajyothy.com

గంగ కాలువల గతేంటి..



బ్రిడ్జిల మాటేంటి..!

● ముందుకు సాగని ముఖ్యమంత్రి హామీలు ● ముంపులో కలిసిన వైసీపీ నేతల మాటలు ● జనంలోకి వెళ్లేందుకు జంకుతున్న వైనం

ఉప ఎన్నికల వేళ వరాల వర్షం కురిపించారు.
అభివృద్ధి అదిరిపోతుందన్నట్లు శంకుస్థాపనలు సాగించారు.
'తెలుగుగంగ కుడి కాలువ పనులు పూర్తి చేసి ఇక్కడ భూములకు సమృద్ధిగా సాగునీరు అందిస్తాం... నియోజకవర్గంలో బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తాం..
అంటూ అప్పట్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గొప్పగా హామీ ఇచ్చారు... అలాగే 2020లో పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, దివంగత ఎమ్మెల్యే వెంకట సుబ్బయ్యలు కూడా ముంపువాసులను ఆదుకుంటామని.. పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు.
అయితే ముఖ్యమంత్రి శంకుస్థాపనలు ముందుకు సాగలేదు.
వైసీపీ నేతల హామీలు ముంపులోనే మునిగిపోయాయి.
వైసీపీ ఐదేళ్ల పాలన ముగిసిపోవడం...
మళ్లీ ఎన్నికలు రానే రావడంతో జనంలోకి వెళ్లేందుకు ఆ పార్టీ నేతలు ముఖం చాటేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

బద్వేలు, ఏప్రిల్ 26: మైదుకూరు, బద్వేలు నియోజకవర్గా లకు ప్రాణాధారమైన తెలుగుగంగ ప్రాజెక్టు ఇప్పటివరకు కూడా బద్వేలు నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిం చే పరిస్థితులు లేవు. 2001లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బద్వేలు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూ.. రూ.54 కోట్లతో తెలుగుగంగ కుడికాలువతో పాటు పెండింగ్‌లో ఉన్న ఎడమ కాలువ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పను లు పూర్తి అయితే బద్వేలు ప్రాంతంలో 30వేల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందు తుందని చెప్పారు. అయితే ఇప్పటికీ ఆ పనులు పూర్తి కాలేదు. సాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో అయా ప్రాంతాల అయ కట్టు రైతులు తీవ్ర అసంతృప్తికి గురవుతు న్నారు. అంతే కాదు రూ.36కోట్లతో బ్రహ్మంసాగర్ ఎడమ కాలువలో 3 ఎత్తిపోతల పథకాలను నిర్మించి ఇటుకలపాడు, సావిశెట్టిపల్లె, వరికుంట్ల, గంగనపల్లె ప్రాంతాలకు 3 వేల ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని తెలిపారు. అయితే రైతాంగానికి ప్రయోజనం కల్పించే స్థాయిలో చేరలేదు.

బ్రిడ్జి పనుల మాటేంటి....?

బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలంలో అనేక గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ప్రయాణం సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ఇక మీదట అలాంటి తిప్పలు లేకుండా రూ.22 కోట్లతో వేమలూరు వద్ద వంతెన నిర్మిస్తామని.. 30 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కలుగు తుందని చెప్పారు. అయితే ఇప్పటికే ఆ బ్రిడ్జికి మోక్షం లేకపోవడంతో ఆ గ్రామాల ప్రజల తీరని కోరికగా మిగిలింది.

ముంపులోనే నేతల హామీ

ముఖ్యమంత్రి హామీలే ముందుకు సాగని పరిస్థితులలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇచ్చిన హామీల పరిస్థితి ఎలా ఉందో ఒక్కసారి పరిశీలిస్తే..

నాలుగేళ్లక్రితం కడప ఎంపీ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, అప్పటి ఎమ్మెల్యే వెంకట సుబ్బయ్య, సోమశిల ప్రాంతాలైన అట్లూరు మండలంలోని చింతావాండ్లపల్లె, ఆకుతోటపల్లె, వరికుంటపల్లె అగ్రహారం, చలంగారిపల్లె భూములు ముంపునకు గురికావడంతో అక్క డికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ముంపు భూముల కు, ఇళ్లకు 3 నెలలలో పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చి నా.. ఇప్పటి వర కు ఆ హామీ నెరవేరలేదు. దీంతో ముంపు వాసుల సమస్య, నగిలేటి బ్రిడ్జి నిర్మాణం, తెలు గుగంగ కాలువల పరిష్కారం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. అధికారంలో ఉండి ఆ పార్టీ నాయకులు ఇచ్చిన హామీలకే దిక్కులేకపోతే మా సమస్యను పరిష్కరించేదెవరు అంటూ బాధిత గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల వేళ ఓటు అడిగేందుకు వెళ్లాలంటే వైసీపీ నేతలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి.


అట్లూరు మండలంలో ముంపునకు గురైన ఆకుతోటపల్లె గ్రామం


అసంపూర్తిగా ఉన్న తెలుగు గంగ కాలువ

సైకిల్ గుర్తు లేకుండా ఎన్నికలు

బద్వేలుటౌన్, ఏప్రిల్ 26 : నందమూరి తారాక రామారావు 1983లో తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుంచి బద్వేలులో ప్రతి ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తూ వస్తోంది. అయితే ఈ సారి సైకిల్ గుర్తు లేకుండానే బద్వేలు, జమ్మలమడుగుల్లో ఎన్నికలు జరగ నున్నాయి. బిజివేముల వీరారెడ్డి బతికి ఉన్నంత వరకు బద్వేలులో తెలుగుదేశంపార్టీకి బద్వేలు అడ్డాగా ఉండేది. వీరారెడ్డి మరణానంతరం ఆయన వారసురాలైన కొండ్రెడ్డి విజయమ్మ రాజకీయ రంగప్రవేశం చేసి 2001లో జరిగిన ఉపఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలుపొందారు. అనంతరం నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా బద్వేలును 2009లో ఎస్సీ రిజర్వ్ అయినప్పటి నుంచి 2009, 2014, 2019 ప్రతి ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ పోటీ చేస్తుండేది. అయితే బద్వేలులో 2021లో వైసీపీ ఎమ్మెల్యే గుంతోటి వెంకటసుబ్బయ్య మృతి చెందారు. తెలుగుదేశంపార్టీ సాంప్రదాయం ప్రకారం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మృతి చెందితే ఆ నియోజకవర్గంలో పార్టీ పోటీ చేయదు. అందులో భాగంగా 2021లో ఉపఎన్నికలు జరిగాయి. అప్పుడు టీడీపీ పోటీ చేయలేదు. వైసీపీ, బీజేపీలు మాత్రమే ఎన్నికల బరిలో నిలిచాయి. ఇక పొత్తు ధర్మంగా ఈ సారి బద్వేలులో బీజేపీకి కేటాయించారు. రెండవసారి సైకిల్ గుర్తులేకుండా ఎన్నికలు జరగ నున్నాయి. అలాగే జమ్మలమడుగులో టీడీపీ ఆవిర్భావం నుంచి కూడా ప్రతి ఎన్నికల్లో పోటీ చేస్తుండేది. అయితే అక్కడ కూడా పొత్తులో భాగంగా జమ్మలమడుగు టికెట్‌ను బీజేపీకి కేటాయించడంతో జమ్మలమడుగులో తొలిసారి సైకిల్‌గుర్తు లేకుండా ఎన్నికలు జరగనున్నాయి.

తెలుసుకోండి...

భారత పౌరుడు కాని వ్యక్తి.. పోటీకి అనర్హుడు

రాజ్యాంగంలోని 84ఏ ప్రకారం భారత పౌరుడు కాని వ్యక్తి పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేసేవీలు లేదు. రాజ్యాంగంలోని 173ఏ ప్రకారం శాసనసభకు ఇదే నిబంధన వర్తిస్తుంది.

- ప్రజాప్రాతినిధ్యం చట్టం 1951లోని సెక్షన్4బి ప్రకారం ఏ నియోజకవర్గంలోనూ ఓటరుగా నమోదు కాని వ్యక్తి పోటీకి అనర్హుడు.
- ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 4సీ, 4సీసీ, 4 సీసీసీ ప్రకారం ఒక రాష్ట్రానికి చెందిన వ్యక్తి మరొక రాష్ట్రంలో పోటీ చేసే వీలుంది. అయితే ఈ సెక్షన్‌ల ప్రకారం అస్సాం రాష్ట్రంలో పోటీ చేసేందుకు మాత్రం వీలు కాదు.
- జైలులో ఉన్న వ్యక్తి కాని, ఒక జైలు నుంచి మరో జైలుకు తరలుతున్న వ్యక్తి కానీ పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తి కాని ఓటు వేయడానికి వీలు లేదు.

కలగా మిగిలిన సురక్ష మంచినీటి పథకం

● అటకెక్కిన పనులు...నీటి కోసం తప్పని తిప్పలు ● జగన్ ప్రభుత్వంలో పురోగతి శూన్యం


మైదుకూరు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిల్వ ఉంచిన తాగునీటి పైపులు

మైదుకూరు, ఏప్రిల్ 26 : అది 2019 ఫిబ్రవరి 20. టీడీపీ ప్రభుత్వం. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షిత తాగునీరు అందించే దిశగా 94.69 కి.మీ పైపులైను వేసేం దుకు రూ.3.5 కోట్ల విలువైన పనులకు అప్పటి మార్కె టింగ్‌శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్‌తో కలసి భూమి పూజ చేశారు. అటు తరువాత టీడీపీ ప్రభుత్వం మారి వైసీపీ ప్రభు త్వం రావడంతో పనులు నేటికి తూతూ మంత్రంగా సాగుతున్నాయి.

తెలుగుగంగ సబ్సిడరీ రిజర్వాయర్ 2 నుంచి 8 కి.మీ ప్రధాన పైపులైను ద్వారా మున్సిపల్ పరిధిలోని కేశ లింగాయపల్లె, చిన్నయ్యగారిపల్లె, శెట్టివారిపల్లె, లింగాల దిన్నె, మహబూబ్‌నగర్ మీదుగా ఎర్రచెరువు మీదుగా మైదుకూరు పట్టణంలో ఇంటింటికి కనెక్షన్ ఇచ్చి కొళాయిల ద్వారా సురక్షిత నీటిని అందించాలనేది లక్ష్యం. 2021 మార్చి 6వ తేదీ పనులు పూర్తి కావాల్సి ఉండగా.. పనులు సక్రమంగా జరగక పోవడంతో ప్రభుత్వం 2025 మార్చి 31 వరకు కాంట్రాక్టరుకు గడువు పెంచింది. 94.69 కి.మీ పైప లైన్లు వేయాల్సి వుండగా.. ఇప్పటి వరకు కనీసం 15 కిలోమీటర్లు కూడా వేయకుండా నిర్లక్ష్యం చేశారు. రూ.3.5 కోట్ల విలువైన పనులకు ఇప్పటి వరకు రూ.2 కోట్లు బిల్లలు చెల్లించినా పనులు మాత్రం కనీసం 25 శాతం కూడా మించలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఏదీ ఏమైనా జగన్ ప్రభుత్వంలో ఇంటింటికి కొళాయిల ద్వారా సురక్షిత తాగునీటి పథకం పనులు మందకొడిగా సాగుతున్నాయి.



తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద అవస్థలు పడుతున్న మైదుకూరు వాసులు

నోట్ దిస్ పాయింట్!



కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 26: గతంలో ఎన్నడు లేని విధంగా ఎన్నికల సంఘం ఓటర్లకు పూర్తిస్థాయి సమాచారం, సాంకేతిక సహకారం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఓటర్లు ఫిర్యాదులు చేసేందుకు... ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక యాప్‌లు, పోర్టల్‌లు, వెబ్‌సైట్‌లు అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌లను వినియోగించుకునేందుకు అధికంగా ముందుకు వస్తున్నారు. తప్పు చేసిన వారికి క్షణాల్లో శిక్ష అమలయ్యేలా రూపొందించారు.

ఓటరు సాయానికి వీహెచ్‌ఏ

ఓటర్ల సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా ఓటరు హెల్ప్ యాప్ (వీహెచ్‌ఏ) పేరిట ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఎన్నికల సంఘం రూపొందించింది. ఇందులో ఓటు నమోదు చేసుకునేందుకు వీలుగా దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. జాబితాలో పేర్లు ఉన్నాయా, లేదా అన్నది సులువుగా తెలుసుకోవచ్చు.

ఫిర్యాదులకు ప్రత్యేకం ఎన్‌జీఎస్

ఓటర్లు ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేసేందకు నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ (ఎన్‌జీఎస్) పేరిట ఒక పోర్టల్ ఉంది. ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫిర్యాదులు ఇందులో నమోదు చేయవచ్చు. దేశ వ్యాప్తంగా ఏ నియోజకవర్గానికి చెందిన ఫిర్యా దులైనా ఇందులో నమోదు చేయవచ్చు. రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ వివరాలు పొందు పరిస్తే సంబంధిత నియోజకవర్గ అధికారులు వీటిని పరిశీలించి చర్యలు చేపడతారు.

అభ్యర్థి గురించి... కేవైసీ

మీ అభ్యర్థి గురించి తెలుసుకునేందుకు నో యువర్ కాండేట్ (కేవైసీ)పేరిట ఒక వెబ్ సైట్ ఉంది. అభ్యర్థులు నామినేసన్ సందర్భంగా దాఖలు చేసే ప్రమాణ పత్రాలు (అఫిడవిట్లు) ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ఎన్నికల సంఘం వెబ్‌సైట్ రూపొందించింది. పోటీలో ఉన్న అభ్యర్థి ఎలాంటి వారు, వారికి నేరచరిత్ర ఏమైనా ఉందా, వారికి ఏఏ ఆస్తులు, ఎక్కడ ఉన్నాయి. స్థిర చరాస్తుల వివరాలు, బంగారు ఆభరణాల వివరాలు తెలుసుకోవచ్చు.

అక్రమాలకు చెక్ పెట్టేందుకు..సీవిజిల్



ఎన్నికల్లో ప్రలోభాలు, అక్రమాలు అరికట్టేందుకు నిర్దేశిం చిన యాప్ ఇది. ప్రజలు తాము గుర్తించిన అక్రమాలను సీవిజిల్ యాప్‌లో సంక్షిప్తంగా నమోదు చేయాలి. వంద నిమిషాల వ్యవధిలో అధికారులు ఆ ప్రదేశానికి చేరుకుని సమాచారం ఆధా రంగా చర్యలు తీసుకుంటారు. తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదు చేసిన వ్యక్తి ఫోనుకు మెసేజ్ రూపంలో తెలుపుతారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచడం ఈ యాప్ ప్రత్యేకత.

వృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం..

వయోవృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం సాక్ష్యం యాప్ అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ కేంద్రానికి సొంతంగా రాలేని వారు ఇందులో తమ పేర్లు నమోదు చేసు కోవచ్చు. నమోదు చేసుకున్నవారిని పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చేందుకు అధికారులు రవాణా సదుపాయం కల్పిస్తారు. దివ్యాంగుల కోసం చక్రాల కుర్చీ సమకూరుస్తారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలు




కొందరు అభ్యర్థులు సెంటిమెంటును రెచ్చగొడితేనే ఓట్లు పడతాయని భావించి కులం, వర్గం, ప్రాంతం పేరుతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు అడ్డుకట్టు వేసేందుకు ఎన్నికల సంఘం నియమావళిలో కఠిన నిబంధనలు రూపొందించింది ఎన్నికల్లో ఎవరైనా జాతి, మత, కుల, భాషా, సమాజం పేరుతో రెచ్చగొడితే ఆర్పీ చట్టం 1951సెక్షన్ 125 ఐపీసీ సెక్షన్ 153ఏ ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష, జరిమనా విధిస్తారు. ఓటు కోసం మద్యం డబ్బులు, ఇతర వస్తువులను తీసుకన్న వారిని కూడా నేరస్తులుగానే పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్ 171 బీ హెచ్ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలుశిక్ష విధిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్ల డబ్బు, మద్యం ప్రవాహంపై నిఘా పెంచారు. నజరానాలకు లొంగిన ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

పోలింగ్ ఏజంట్లే కీలకం

ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరఫున పరిశీలనకు కూర్చునే ఏజంట్ల పాత్ర అత్యంత కీలకం. అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం ఓట ర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడిన కష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. అటువంటి కేంద్రంలో పోలింగ్ సక్రమంగా జరుగుతుందా, లేదా అన్నది గమనించడం.. బోగస్ ఓట్లు పడకుండా ఓటు వేయడానికి వచ్చిన వారిని నిశి తంగా పరిశీలించడం ఏజంట్ల పని. గుర్తింపు పొందిన రిజిస్టర్డ్ పార్టీలు అభ్యర్థుల తరఫున ప్రాధాన్యత క్రమంలో ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో కూర్చుంటారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే ప్రతి కదలిక ఏజంటు నిశితంగా పరిశీలించాలి. ఏ మాత్రం అనుమానం వచ్చినా ఏజంటు తన అభ్యంతరాన్ని ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. అభ్యర్థులు తమకు ఎంతో నమ్మకెమైన వారిని ఏజెంటుగా కూర్చోబెడుతారు. ఏజంటు ఏ మాత్రం తప్పు చేసినా ఆ పార్టీ అభ్యర్థికి నష్టమే.

పులివెందులలో ఒకేఒక్కడు..!

● 16 సార్లు ఎన్నికలు ● 12 సార్లు కాంగ్రెస్ గెలుపు
● 3 సార్లు వైసీపీ ● ఒక్కసారి స్వతంత్ర అభ్యర్థి గెలుపు
● ఒకసారి ఎన్నిక ఏకగ్రీవం, రెండుసార్లు ఉప ఎన్నికలు



పులివెందుల, ఏప్రిల్ 26: పులివెందుల ముఖచిత్రంలో కాంగ్రెస్ పార్టీ హవానే కొనసాగింది. నియోజకవర్గం ప్రస్థానం మొదలైన తర్వాత మొట్టమొదటి అసెంబ్లీ ఎన్నికలు 1955లో జరిగాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు 16సార్లు ఎన్నికలు జరగ్గా.. 12 సార్లు కాంగ్రెస్ విజయం సాధించి సత్తా చాటింది. మూడుసార్లు వైసీపీ గెలుపొందగా.. ఒక్కసారి స్వతంత్య అభ్యర్థి గెలుపొందడం ఇక్కడ విశేషం.. ఇక రెండుసార్లు ఉప ఎన్నికలు జరిగాయి. కాగా, ఒకసారి ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. వివరాల్లోకెళితే....

పులివెందుల నియోజకవర్గంగా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 14 సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. రెండుసార్లు ఉపఎన్నికలు అనివార్యమయ్యాయి. 1955లో ప్రారంభమైన పులివెందుల మొట్ట మొదట ఆరు మండలాలతో నియోజకవర్గంగా ఏర్పడింది. 2009 ఎన్నికల సమయంలో జిల్లాలోని నియోజకవర్గాల పునర్విభజన సమయంలో లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గంలో ఉన్న చక్రాయపేట మండలాన్ని పులివెందుల నియోజకవర్గంలో కలిపారు. పునర్విభ జన అనంతరం 2009 అసెంబ్లీ ఎన్నికల్లో చక్రాయపేట మండ లం పులివెందుల నియోజకవర్గ ఎన్నికల్లో చోటు దక్కింది. దీంతో అప్పటి నుంచి పులివెందుల నియోజకవర్గం ఏడు మండలాలుగా కొనసాగు తోంది. ఈ నియోజక వర్గంలో పూర్తిగా ఆధిపత్యం వైఎస్ కుటుంబా నిదే. అందులోను కాంగ్రెస్ పార్టీదే హవా కొనసాగుతూ వచ్చింది.

1955లో కాంగ్రెస్ పార్టీ తరఫున పెంచికల బసిరెడ్డి నుంచి కాంగ్రెస్ పార్టీ విజయ ప్రస్థానం సాగింది. కానీ 1962లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పెంచికల బసిరెడ్డిపై స్వతంత్ర అభ్యర్థి చవ్వా బాలిరెడ్డి గెలుపొందారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొం దింది. అప్పటి నుంచి 2009 వరకు కాంగ్రెస్ పార్టీ హవా కొన సాగింది. కాంగ్రెస్ పార్టీ తరఫున పెంచికల బసి రెడ్డి మూడు పర్యాయాలు విజయం సాధించారు. 1978లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో దిగి గెలుపొందారు. 1983లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ (ఐ) తరఫున బరిలో నిలిచి గెలుపొందారు. 1983 నుంచి ఇప్పటి వరకు ప్రత్యర్థి పార్టీ టీడీపీ బరిలో నిలుస్తూ వచ్చింది. అభ్యర్థులు వేరైనా విజయం మాత్రం కాంగ్రెస్ పార్టీదే. 1991లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున వైఎస్ పురుషోత్తమరెడ్డి గెలుపొం దారు. 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మృతితో ఎన్నికలు అనివార్యమ య్యాయి. కానీ ఆ సమయంలో ఏ పార్టీ పోటీలో నిలవకపోవడంతో ఆయన సతీమణి వైఎస్ విజ యలక్ష్మి పులివెందుల ఎమ్మెల్యేగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సొంతపార్టీ స్థాపించుకున్న అనంతరం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడంతో పులివెందుల అసెంబ్లీకి ఉప ఎన్నికలు అనివార్య మ య్యాయి. 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్ విజయలక్ష్మి గెలు పొందారు. 2011 నుంచి మరో రెండుసార్లు జరిగిన అసెంబ్లీ ఎన్ని కల్లో ఆ పార్టీనే గెలుపొందింది. 2019 ఎన్నికల్లో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

పులివెందుల నియోజక వర్గం నుంచి ఎన్నికైన ఇరువురు రాష్ట్ర ముఖ్యమంత్రులు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, ప్రస్తుతం 2024లో జరగనున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇక్కడ నుంచి పోటీ చేస్తుం డడం.. వైఎస్ తనయ, జగన్ సోదరి షర్మిల రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆ పార్టీ తరఫున అభ్యర్థిని బరిలో నిలపడం.. టీడీపీ బలం పుంజుకుని పోటీ చేస్తుండడం ఆసక్తికరంగా మారింది.


పులివెందుల మొట్ట మొదటి ఎమ్మెల్యే పెంచికల బసిరెడ్డి


స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన చవ్వా బాలిరెడ్డి

ఎంపీ అవినాశ్‌కు చేదు అనుభవం

● సమస్యలపై నిలదీసిన అట్లూరు వాసులు


ఎంపీని సమస్యలపై నిలదీస్తున్న అట్లూరు మండలం చెండువాయి కాలనీవాసులు

అట్లూరు, ఏప్రిల్ 26 : కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. గెలిచిన ఐదేళ్లకు మా ఊరికి మళ్లీ ఓట్లకోసం వచ్చారు.. మా సమస్యలు ఒక్కటైనా పరిష్కరించారా అని జనం నిలదీశారు. వివరాలు ఇలా..

శుక్రవారం ఎంపీ అవినాశ్‌రెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే అభ్యర్థి సుధతో కలసి అట్లూరు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెడ్డిపల్లె క్రాస్‌రోడ్డు, చెండువాయి కాలనీ, ఉప్పుటూరు కాలనీ, మద్దూరు, వరికుంట కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ప్రజలు సమస్యలపై ఎంపీని నిలదీశారు. మీకు ఓట్లు వేసి గెలిపిస్తే ఐదేళ్లకు మళ్లీ ఓట్లకు మాత్రమే వచ్చారన్నారు. తమ సమస్యలు స్థానికంగా ఏ వైసీపీ నాయకుడు పట్టించుకోలేదన్నారు. తాగునీటి పైపులైను లేదని, కరంటు వైర్లు పాతబడి తెగిపోతున్నాయని, డ్రైనేజీలు లేవని, సిమెం టు రోడ్లు, వీధిలైట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ముంపు గ్రామా లైన చింతవాళ్లపల్లె, ఆకుతోటపల్లె, చలంగారిపల్లె, ఆగ్రహారం గ్రామాల భూములకు, ఇళ్లకు మూడు నెలల్లోనే పరిహారం చెల్లిస్తామంటూ 2020లో ఎంపీ, ఎమ్మెల్సీ, అప్పటి ఎమ్మెల్యే మాట ఇచ్చారన్నారు. ఇప్పటికీ ఆ వాగ్దానం నెరవేర్చ లేదన్నారు. స్థానిక వైసీపీ నాయకులు సర్దిచెప్పే ప్రయత్నం చేయగా.. ఈ రోజైనా మాకాలనీ సమస్యలు తీర్చారా అంటూ నిలదీశారు. దీంతో వైసీపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా.. ఎంపీ పర్యటనకు జనాన్ని తరలించేందుకు రావాలంటూ వైసీపీ నాయకులు అట్లూరు బీసీ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కుంభగిరి క్రిష్ణను పిలి చారు. తనకు ఆరోగ్యం బాగోలేదని రాలేనని ఆయన చెప్పారు. దీంతో వైసీపీ నాయ కులు దుర్భాషలాడటంతో బాధితుడు అట్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమయం లేదు.. మిత్రమా!

- నేనూ మీలో ఒకడినే..
- పలుకలేదని అపార్థం చేసుకోవద్దు..
- వ్యక్తిగత ఇగోలకు దూరంగా ఉండండి
- గ్రూపులను మరచిపోండి
- పాత.. కొత్త తేడాలు లేకుండా పని చేయండి
- గెలిపించే బాధ్యత నేతలు, కార్యకర్తలదే.
- టీడీపీ శ్రేణులకు సుగవాసి బహిరంగ విజ్ఞప్తి

రాజంపేట, ఏప్రిల్ 26: ఎన్నికలకు పక్షం రోజులే సమయం ఉంది. ఎన్నో ఏళ్లుగా పక్క నియోజకవర్గం ప్రజలకు సేవలందించాను. 20 రోజుల క్రితమే ఇక్కడికి వచ్చాను. మీరంతా ఎన్నో ఏళ్లుగా ఇక్కడ టీడీపీకి సేవలందిస్తున్నారు. నేను స్వయంగా పలుకరించలేదని, మాట్లాడలేదని ఎవరూ అపార్థం చేసుకోవద్దు. పాత, కొత్త నేతలంటూ వైషమ్యాలకు పోకుండా సమన్వయంతో సమష్టిగా సైనికుల్లా టీడీపీ విజయానికి కృషి చేయండి. ఈ ఎన్నికల సమరాంగణంలో విజయరథ సారథులు.. వారథులూ మీరేనంటూ రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం శుక్రవారం టీడీపీ తోపాటు, ఎన్డీఏ కూటమి నేతలకు బహిరంగంగావిజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తనకు, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, నియోజకవర్గ నేత పోలి సుబ్బారెడ్డికి సంయుక్తంగా కొన్ని సూచనలు చేశారన్నారు.. టీడీపీలో చేరిన కొత్తవారికి ప్రాధాన్యమిస్తూనే, ఎన్నో ఏళ్లుగా పార్టీలో ఉన్న బూత్‌లెవెల్ క్యాడర్‌తోనే ఎన్నికలకు వెళ్లాలని, పాత, కొత్త కలయికతో ఈ నియోజకవర్గ టీడీపీలో కొత్త చరిత్ర సృష్టించి భారీ మెజారిటీ సాధించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. నేను వచ్చి ఇప్పటికి 20 రోజులైంది... కొన్ని గ్రామాల్లో రెండు గ్రూపులుంటాయి.. .ఒకరికి చెబితే మరొకరికి కోపం, వారికి చెబితే వీరికి కోపంగా ఉంటుంది. అందువల్ల నేను తటస్థంగా ఉన్నానని అనుకోవద్దు.. నాకు శత్రువులు, మిత్రులంటూ ఎవరూ లేరు.. నేను ఎవరికీ వ్యతిరేకిని కాను.. నన్ను నమ్మి అధినేత టికెట్టు ఎలా కేటాయించారో.. అదే విధంగా మీరు నన్ను నమ్మి ఈ ఎన్నికలను మీవిగా భావించి ముందుకు సాగండి.. ఇక కేవలం పది రోజుల్లో ఎన్నికలు ఉన్నాయి.. ఈ తక్కువ సమయంలో సరిగ్గా పలకరించ లేదని అన్యతా భావించవద్దని విన్నవించారు. నాకు ఆరు నెలల సమయం ఇవ్వండి... మీ కుటుంబ సభ్యుడిలో ఒకడిలా ఉంటా.. పార్టీ విజయం వైపు నడిపించండి.. ఈ ఎన్నికలు మనందరివీ.. పార్టీ మనందరిదీ.. నియోజకవర్గంలో వందలాది గ్రామాలు వేలాది మంది కార్యకర్తలు, నేతలు ఉన్నారు.. వీరందరినీ వ్యక్తిగతంగా పలకరించ లేదని అపార్థం చేసుకోవద్దు.... తాను పక్క నియోజకవర్గంలో 25 ఏళ్లుగా ఉన్నాను, అక్కడ పనిచేస్తున్నాను. నియోజకవర్గంలో ఎవరికీ ఏ కార్యక్రమం జరిగినా అది నా ఇంటి కార్యక్రమంలా భావించి నేనే స్వయంగా జీపు నడుపుకుంటూ వారి ఇళ్లకు వెళ్లి.. పేరుపేరున పలకరించి వారిలో ఒకరిలా ఉన్నాను. ఇప్పుడు ఎన్నికలు పూర్తైన తరువాత నేను మీలో ఒకడిని.. అప్పటి వరకు నన్ను అపార్థం చేసుకోవద్దు.. ఇక్కడ ఎన్నికల సారథులు మీరే.. మీ ఆధ్వర్యంలోనే ఎన్నికలు జరుగుతాయి.. నాకు వ్యక్తిగత అజెండా ఏమీ లేదు. పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాలే మనకు శిరోధార్యం.. ఎన్నికల్లో భారీ మెజారిటీతో పార్టీని గెలిపిస్తే.. తదనంతరం మీరు చెప్పినట్లు మనం ముందుకు సాగుదాం.. పాత, కొత్త నేతల కలయిక భారీ మెజారిటీ వైపు సాగాలని ఈ తక్కువ సమయంలో రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని వినయంగా కోరుకుంటున్నానన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం

'వైసీపీని చిత్తుచిత్తుగా ఓడిస్తాం'

రాజంపేట, ఏప్రిల్ 26 : సమష్టి కృషితో విజయం సాధిస్తామని నియోజక వర్గ టీడీపీ నేత పోలి సుబ్బారెడ్డి అన్నారు. నందలూరు, రాజంపేటకు చెందిన టీడీపీ నేతలతో శుక్రవారం రాజంపేటలోని తన ఇంట్లో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన మరికొంత మంది ముఖ్యనేతల చేరికపై చర్చించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అత్యధిక మెజారిటీలతో గెలుపొందడం తథ్యమన్నారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా సమష్టిగా కృషి చేస్తున్నామన్నారు. నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం రాజంపేట నియోజక వర్గాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని వైసీపీని చిత్తుచిత్తుగా ఓడిద్దామని సూచించారు. ఈ కార్యక్రమంలో నందలూరు మండల మాజీ అధ్యక్షుడు లక్ష్మీనరసయ్య, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, కౌన్సిలర్ పసుపులేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ నేతలతో మాట్లాడుతున్న పోలి సుబ్బారెడ్డి

టీడీపీతోనే మైనారిటీల సంక్షేమం

సుండుపల్లె, ఏప్రిల్ 26 : మైనారిటీల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని రాయవరం కస్పాలో మైనారిటీ నాయకులను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర బాబు నాయుడు మైనారిటీల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని, ప్రస్తుతం వైసీపీ పాలనలో మైనారిటీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సంక్షేమాన్ని మరిచి రాష్ట్రంలో రౌడీ రాజ్యాన్ని తీసుకొచ్చారని అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలని తెలియజేశారు. మైనారిటీలందరూ చంద్రబాబు నాయుడును ఆశీర్వదించాలని రాజంపేటలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం అఖండ మెజారిటీతో గెలిపించాల ని కోరారు. కాగా, సుగవాసి గెలుపునకు తమ వం తు కృషి చేస్తామని ముస్లిం నేతలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయవరం మత పెద్దలు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.


మైనారిటీ నాయకులతో మాట్లాడుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు

సమష్టి కృషితో భారీ మెజారిటీ సాధించండి

- జోన్ టీడీపీ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి

రాజంపేట, ఏప్రిల్ 26: నియోజకవర్గంలోని నాయకులు, మండల నేతలు, గ్రామ నేతలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీ సభ్యులు, వివిధ విభాగాల నాయకులు అందరూ సమష్టిగా పనిచేసి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాల సుబ్రమణ్యంను, పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలుగుదేశంపార్టీ రాయలసీమ జోన్ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాజంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం అధ్యక్షతన నిర్వహించిన టీడీపీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులందరూ వ్యక్తిగత ప్రతిష్టకు పోకుండా విజయమే లక్ష్యంగా అన్ని విభాగాల నాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే ఎన్నికల పరిశీలకులు దుర్గాప్రసాద్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి పరిష్కరిస్తారన్నారు. వైసీపీ దురాగతాలను ఎండగడుతూ ఎన్డీఏ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు.

● ప్రచారం వేగవంతం చేయండి

ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాయకులంతా అనుకుంటే ఈ నియోజక వర్గంలో వైసీపీకి డిపాజిట్ కూడా దక్కే అవకాశం లేదన్నారు. పార్టీలో ఆదినుంచి ఉన్న నాయకులు, కొత్తగా చేరిన వారు కలిసికట్టుగా ఈ ఎన్నికలను ఎదుర్కో వాలన్నారు. బూత్ కమిటీ, మండల కమిటీల సభ్యులు గ్రామాల్లో ప్రచారాన్ని వేగవంతం చేయాలన్నా రు. రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

రెట్టింపు ఉత్సాహంతో పని చేయండి : జగన్‌మోహన్ రాజు

రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ నాయకులందరూ ఈ ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంగా పనిచేసి సుగవాసి బాలసుబ్రమణ్యంను, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీలతో గెలిపించుకోవాలన్నారు.

అసంతృప్తులకు లోను కాకండి : సుగవాసి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రాయలసీమ జోన్ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షు డు జగన్‌మోహన్‌రాజు, నియోజకవర్గ నాయకులు పోలి సుబ్బారెడ్డి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో అధిష్టానం సూచనల మేరకు నియోజకవర్గంలోని పాత, కొత్త నేతలు అందరూ కలిసి భారీ మెజారిటీ సాధనకు కృషి చేయాలన్నారు. తక్కువ సమయం ఉన్నందున ఎవరూ వ్యక్తిగత అసంతృప్తులకు లోనకాకుండా ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు.

సమష్టి కృషితోనే.. దుర్గాప్రసాద్

ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాజంపేట టీడీపీ భారీ మెజారిటీ దిశగా దూసుకుపోతోందన్నారు. ఎన్డీఏ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని సుగవాసి బాలసుబ్రమణ్యంతో పాటు అత్యధిక మెజా రిటీతో గెలుపొందుతారన్నారు. పాత, కొత్త నేతలు పాలు, నీళ్లలా కలిసిపోవాలన్నారు. సమష్టిగా కృషి చేస్తేనే విజయం సులభమవుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మల్లెల శ్రీవాణి, పార్లమెంటు లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, మైనారిటీ నాయకులు అబుబకర్, నందలూరు మండలాధ్యక్షుడు సుబ్బయ్య, నరసింహారెడ్డి, రెడ్డప్ప, టీఎన్ ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, రాంనగర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం, దీపక్‌రెడ్డి, రాంగోపాల్ రెడ్డి, చమర్తి జగన్‌మోహన్ రాజు

సుగవాసికి అండగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

సుండుపల్లి, ఏప్రిల్ 26 : రాజంపేట టీడీపీ బాల సుబ్రమణ్యంకు అండగా మేమున్నామంటూ సాఫ్‌వేర్ ఉద్యోగులు ముందుకు వచ్చారు. సుండుపల్లి పర్యటనలో భాగంగా రాయవరం వెళ్లిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబును సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కలిసి తమ మద్దతు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో సుగవాసి బాలసుబ్రమణ్యం కోసం పనిచేసే ఆయన గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. .ఈ కార్యక్రమంలో నాగేంద్ర, మారుతి, బాలాజీ, సురేష్, నవీన్‌కుమార్, ప్రవీణ్, వినయ్, సాయిరెడ్డి, శ్రీనాథ్, విష్ణు, చింటూ, మురళీతదితరులు పాల్గొన్నారు.


టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

వీరబల్లి, ఏప్రిల్ 25 : రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం సాయికుమార్‌రాజు ఆధ్వర్యంలో వీరబల్లి మండలం ఓదివేడు కావలిపల్లెకు చెందిన వైసీపీ నాయకులు కుమ్మరపల్లె రామయ్య, మహేశ్వర్‌రాజు, బాలరాజు, రఘునాథరాజు తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రవిరాజు, హరినాథరాజు, సదాశివరాజు, మహేంద్రరాజు, రఘురామరాజు పాల్గొన్నారు.

మహేష్‌నాయుడుకు అభినందనలు

రాజంపేట, ఏప్రిల్ 6: రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా ని యమితుడైన సుండుపల్లి నేత మహేష్‌నాయుడును రాజంపేటలో ఆ పార్టీ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి దీపక్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాం భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల శ్రీవాణి తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా నేతలను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.


మహేష్‌నాయుడును అభినందిస్తున్న రామగోపాల్‌రెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యం

బీసీలు ఐక్యమై వైసీపీని ఓడించండి

రాజంపేట, ఏప్రిల్ 26 : నియోజకవర్గంలోని బీసీలందరూ ఐక్యమై ఈ ప్రాంతాన్ని అధోగతి పాలు చేసిన వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని టీడీపీ మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి పిలుపునిచ్చారు. బోయపాలెం, మంగళమిట్ట ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కేకును కట్ చేసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడు, నిగర్వి రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాజంపేట నియోజకవర్గంలో అన్ని మండలాల్లో బీసీలు అధికంగా ఉన్నారని వీరందరూ ఉన్నత పదవులు పొందాలంటే టీడీపీని అధికారంలోకి తేవాలన్నారు.ఈ సమయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల బీసీలంతా ఐక్యంగా ముందుకు రావాలన్నారు. మల్లెల సురేంద్ర, రాజంపేట టీడీపీ సీనియర్ బీసీ నాయకులు మల్లెల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


మల్లెల శ్రీవాణిని సన్మానిస్తున్న మహిళలు, బీసీలు

ప్రధాన నేతలకు కీలక పదవులు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 26 : రాజంపేట నియోజకవర్గంలోని ప్రధాన నాయకులకు కీలక పదవులు ఇస్తూ ఆ పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల శ్రీవాణి, రాష్ట్ర మహిళా సంఘం ఉపాధ్యక్షురాలుగా, సీనియర్ సుండుపల్లి నేత మహేష్‌నాయుడుకు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, బీసీ నేత ఇడిమడకల కుమార్ మైదుకూరు ఎన్నికల పరిశీలకులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు తమపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించారని, రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. తమను నియమించిన అచ్చెన్నాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

'వైసీపీ నేతలకు ఓట్లు అడిగే అర్హత లేదు'

రాజంపేట, ఏప్రిల్ 26 : రాజంపేటను అన్నిరంగాల్లో అధోగతిపాలు చేసిన వైసీపీ నాయకులకు ఓట్లు అడిగే అర్హత లేదని జనసేన పార్టీ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ అన్నారు. శుక్ర వారం రాజంపేట జనసేన కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ జన సేన, బీజేపీ, ప్రజాగళం బహిరంగ సభను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంతంలో వైసీపీ డిపాజిట్ కోల్పోకతప్పదన్నారు. రాజంపేటలో ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం అత్యధిక మెజారిటీతో గెలుపొందేందుకు కూటమి నేతలమంతా అహర్నిశలు పాటుపడతామన్నారు. లీగల్‌సెల్ నాయకులు కత్తి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న జనసేన ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ

ప్రచారంలో దూసుకుపోతున్న మండిపల్లి


రాయచోటిటౌన్, ఏప్రిల్ 26: రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని వర్గాలను కలుపుకొని గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. శుక్రవారం రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన ప్రచారం మొదలు పెట్టి 60 రోజులైనా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తగ్గని జోరుతో మండుటెండలను సైతం లెక్కచేయకుండా మండిపల్లి రాముడు వెంట నడుస్తున్నారు. దీంతో మరింత ఉత్సాహంతో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఇందులో భా గంగానే మాధవరం గ్రామంలో సైకం శ్రీనివాసులరెడ్డి నేతృత్వంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్త ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఇంటిలో పూలదండలు, మంగళ హారతులతో ప్రజలు, మహిళలు మండిపల్లి రాముడికి అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకసారి ఆశీర్వదించండి మీ రుణం తీర్చుకుంటానని ఓటర్లకు చెప్తున్నారు. ప్రచారంలో భాగంగా ఆయన రాయచోటి మండలంలోని మాధవరం గ్రామం మద్దెలకుంట, గుట్టకిందపల్లి, రెడ్డివారిపల్లె, చెంచురెడ్డిగారిపల్లె, తమటంవారిపల్లి, మూలపల్లి, ఇర్రివాండ్లపల్లె, గురికానివాండ్లపల్లిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బ్రహ్మరథం పట్టారు. బ్యాండు మేళాలు, బాణసంచాలతో, పూలవర్షంతో స్వాగతం పలికి హారతులు పట్టి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఇంటింటికి తిరుగుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని, రాయచోటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు మద్దతు ఇచ్చి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని, కమలం గుర్తుపై ఓటు వేసి రాజంపేట పార్లమెంట్ ఎన్డీఏ కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాధవరం గ్రామ ముఖ్య నాయకులు, తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు. మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గెలుస్తున్నారని నారా చంద్రబాబునాయుడు చెప్పారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. సర్వేల్లో రాంప్రసాద్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నారని చంద్రబాబు తెలిపారన్నారు. మాయ మాటలతో మోసం చేసిన శ్రీకాంత్ రెడ్డిని పవిత్రమైన ఓటు ద్వారా గుణపాఠం చెప్పి ఇంటికి పంపాలని కోరారు.


మాధవరం మూలపల్లిలో ఇంటింట ప్రచారంలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సెవెన్త్‌సెన్స్‌తో భాగస్వామ్యం సంతోషదాయకం

- బిట్స్ ప్రిన్సిపాల్ భాస్కర్

రామాపురం, ఏప్రిల్ 26: సెవెన్త్ సెన్స్‌తో భాగస్వామ్యం కావడం సంతోషదాయకమని (బిట్స్) ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం మన్నేరు భాస్కర్ అన్నారు. మండలంలోని బండపల్లి పంచా యతీ బిట్స్ కాలేజీలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు సెవెన్త్ సెన్స్ టాలెంట్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల సాఫ్ట్‌స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంబంధమైన, వృత్తిపరమైన విజయానికి అవసరమైన కమ్యూనికేషన్,నైపుణ్యాలను విద్యార్థులకు అందించడం తమ సంస్థ లక్ష్యమన్నారు. సాంకేతిక పరిజ్ఞానానికి మించిన నైపుణ్యాలను విస్తరింపజేసేందుకు బిట్స్ నిబద్ధతను హైలెట్ చేస్తుందని, ఈ విలువైన ప్రోగ్రాంను విద్యా ర్థులకు అందించడానికి సెవెన్త్ సెన్స్‌తో భాగస్వాములైనందుకు తాము సంతోషిస్తున్నామన్నారు. ఏ రంగంలోనైనా విజయానికి సమర్థవంతమైన కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ అవసరం. ఈ కార్యక్రమం మా విద్యార్థులకు గణనీయమైన ప్రయోజనాన్ని ఇస్తుందని విశ్వసిస్తున్నా మన్నారు. సెవెంత్ సెన్స్ నుంచి ట్రైనర్ కిరణ్ ఆకర్షణీయమైన, ఇంటరాక్టివ్ విధానాన్ని విద్యార్థులు ప్రశంసించారు. ఈ శిక్షణ జాబ్ మార్కెట్‌లో బాగా సిద్ధమవడానికి ఒక సానుకూల దశ అన్నారు.


మాట్లాడుతున్న బిట్స్ కాలేజ్ యజమాని భాస్కర్

తాగునీటి కోసం మహిళల నిరసన

సిద్దవటం, ఏప్రిల్ 26: సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామ పంచాయతీ, రామకృష్ణాపురం, వెంకటేశ్వరపురంలో రెండు వారాలుగా తాగునీరు రావడం లేదంటూ శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. వేసవి కాలంలో తాగునీరు అందించకపోతే ఎలా బతకాలని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని మహిళలు కోరారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనరసయ్యను వివరణ కోరగా వేసవి కాలం కాబట్టి నీటి శాతం గణనీయంగా పడిపోయిందని, పెన్నానది నుంచి వచ్చే మంచినీటి పైపులు డ్యామేజీ అయ్యాయని, ట్యాంకర్లతో నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

టీడీపీని గెలిపిద్దాం.. చంద్రబాబును ముఖ్యమంత్రి చేద్దాం

సిద్దవటం, ఏప్రిల్ 26 సుగవాసి సుబ్రమణ్యంను భారీ మెజారిటీతో గెలిపించి తెలుగుదేశం పార్టీ సత్తా ఏమిటో వైసీపీ ప్రభుత్వానికి చూపాలంటూ టీడీపీ నాయకుడు కుప్పాల వెంకటసుబ్బయ్య శుక్రవారం బొగ్గిడివారిపల్లె పంచాయతీలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప అభివృద్ధి లేదు


చిట్వేలి, ఏప్రిల్ 26 : వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప అభివృద్ధి ఏమీ లేదని ముక్కా వరలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మార్గెపల్లెలో మండల అధ్యక్షుడు కె.కె.చౌదరి, ఎన్డీఏ నేతలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం చేశారు.

మద్యం దుకాణాలపై ప్రత్యేక నిఘా..

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 26: ప్రభుత్వ మద్యం దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ నోడల్ అధికారి చంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. స్టాకు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జయసింహ, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టరు రామక్రిష్ణ శాస్త్రి, ఇన్‌స్పెక్టరు గాయత్రీ, జీఎస్‌టీవో అధికారి హేమంత్ కుమార్ మరియు సిబ్బంది సుధాకర్, విజయ్ మరియు రెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీజ్ఞానాంబిక కళాశాలకు అటానమస్ హోదా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26: మదన పల్లెలోని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా కల్పిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు గతేడాది న్యాక్ ఏ ప్లస్ (3.46 ఎన్‌జీ పీఏ) గుర్తింపు వచ్చిందన్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం యూజీసీ అటాన మస్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ హోదాతో స్వేచ్ఛగా, స్వతంత్ర్యంగా పనిచేస్తామని పాఠ్యాంశాల సిలబస్, ఆర్థిక వనరులు, పరీక్షల నిర్వహణ, బోధన, రోజు వారి కార్యక్రమాలన్నింటి తమ కళాశాల ఆధ్వర్యంలోనే జరుగుతాయన్నారు. ఎస్వీ యూనివరిటి పరిధిలో తొలిసారిగా ప్రైవేటు డిగ్రీ కళాశాలగా తమకు అటానమస్ హోదా దక్కడం గర్వకారణంగా వుందన్నారు. ఈ హోదాతో మరింత బాధ్య తగా పనిచేస్తామన్నారు. ప్రపంచీకరణకు అనుగుణంగా నిర్దేశించిన సమయంలో సిలబస్ పూర్తి చేసి, పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనం తరం బీటీ కళాశాల రిటైర్డ్ అధ్యాపకులు మల్లికార్జున, శివప్రసాద్‌లు కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవిని పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.


కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవిని అభినందిస్తున్న రిటైర్డ్ అధ్యాపకులు

పోలింగ్ తేదీ మే 13

గుర్తుంచుకోండి

అధికారం మీ చేతుల్లో, ఈవీఎంల వద్ద ఉంది. గుర్తుంచుకోండి.. మే 13 పోలింగ్ తేదీ.. అంటూ ఓటు విలువను గుర్తు చేస్తూ చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్టిక్కర్ల ద్వారా ప్రచారం కల్పిస్తున్నారు. ఓటు హక్కు ప్రాధాన్యత, పోలింగ్ తేదీపై అవగాహన కోసం ప్రత్యేకంగా స్టిక్కర్లను రూపొందించారు. వీటిని గ్యాస్ సిలిండర్లపై అతికించి సరఫరా చేస్తున్నారు. ఆటోలు, జనం ఎక్కువగా గుమికూడే దుకాణాలు, రద్దీ ప్రాంతాల్లోనూ వీటిని అతికిస్తున్నారు.



- చిత్తూరు

ఒకప్పట్లో 21 ఏళ్లకు ఓటు

ఎట్టెట్టా..

దేశంలో మొదటి సాధారణ ఎన్నికలు 1952లో ఎన్నికల కమిషనర్ సుకుమార్ సైన్ ఆధ్వర్యంలో జరిగాయి. అప్పట్లో 17.90 కోట్ల మంది ఓటర్లు. అప్పటి నుంచి 1985 వరకు జరగిన ఎన్నికల్లో 21 ఏళ్ల నిండిన వారికే ఓటు హక్కు కల్పించారు. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక 1988లో 61వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఓటు హక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించారు.



- చిత్తూరు

పోస్టల్ బ్యాలెట్‌లో గుర్తులుండవు

మీకు తెలుసా?

గుర్తులు లేకుండా ఎన్నికలు ఏమిటా అని సందేహం రావచ్చు. ఇది నిజమే! పోస్టల్ బ్యాలెట్‌లో పార్టీ గుర్తులుండవు. అభ్యర్థి, పార్టీ పేర్లు మాత్రమే ఉంటాయి. సార్వత్రిక ఎన్నికల రోజు విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన వ్యక్తులు పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగిస్తారు. అంతకుముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగే సమయంలో సాధారణ ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పత్రాన్ని ఉద్యోగులకు ఇచ్చేవారు. వచ్చినవాటిలో చివరివాటిని తీసి పోస్టల్ ఓటు వేసే ఉద్యోగులకు అందించేవారు. ఈవీఎంలు వచ్చాక వీరికి పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. దీన్నిబట్టి వారి నియోజకవర్గం ప్రాంతంలో పోటీచేసే అభ్యర్థి పేరు, పార్టీ పేరు ముద్రిస్తారు. గుర్తు ఉండకపోవడంతో అభ్యర్థి పేరు పక్కన టిక్ చేయాల్సి ఉంటుంది.



- చిత్తూరు కలెక్టరేట్

జన చైతన్యం



రైతు భరోసా అంటే.. ఊరూరా కేంద్రాలు నిర్మించడం. వాటికి అధికారపార్టీ జెండా రంగులు వేయడం. సీఎం జగన్ బొమ్మను చిత్రించడం. కరెంటు కోతలు.. ఆగిన రాయితీలు.. అందని ప్రభుత్వ సాయాలు. ఇంతేనా..?

కానే కాదు.. నిరంతర విద్యుత్తు సరఫరా, రాయితీలతో రైతులను ఆదుకోవడమే నిజమైన భరోసా. ఈ దిశగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు రైతులకు అండగా నిలుస్తున్నాయి.

అందుకే.. ప్రస్తుతం కుప్పం నియోజకవర్గంలోని కొందరు రైతులు ఎండిపోయిన పంటల దగ్గర గుండెనిండా దుఃఖంతో కుములుతుంటే, పొలాలను బీళ్లు పెట్టుకుని మరికొంతమంది పశువుల కాపరులుగా మారుతున్నారు. ఆ పశువుల మేతకు వేసిన గడ్డిమళ్లూ నీరందక మలమలమాడుతుంటే అచేతనంగా చూస్తున్నారు. కాస్త సరిహద్దులు దాటి చూస్తే.. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని రైతులేమో పంటల సాగుతో సంతృప్త జీవనం సాగిస్తున్నారు.

జిల్లా సరిహద్దుల్లోని మూడు రాష్ట్రాల పరిధిలో వ్యవసాయం, ప్రభుత్వ ప్రోత్సాహాలను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది. దీనిపై ప్రత్యేక కథనం అందిస్తోంది. - కుప్పం



● 'కోతల' జగన్

ఏపీ: ఎండుతున్న పంటలు

కుప్పం మండలం చందం వద్ద కరెంటు కోతలతో ఎండిన టమోటా తోట

కుప్పం నియోజవర్గంలో ఉద్యాన పంటలు అధికం. రాగి, వరి వంటి సంప్రదాయ పంటలూ సాగు చేస్తున్నారు. బోర్లలో అరకొరగా నీళ్లున్నా.. పంటలకు అందించేందుకు విద్యుత్తే ఉండడం లేదు. వ్యవసాయానికి 9 గంటల కరెంటు ఇస్తున్నామని అధికార పార్టీ ఊదరగొడుతోంది. పేరుకు ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు రెండు షిఫ్టుల్లో ఇస్తున్నామంటున్నారు. కానీ, ఈ కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. ఒకసారి నీళ్ల పైకెత్తి కొద్దిదూరం పారేసరికి కరెంటు పోతుంది. మళ్లీ కరెంటు వచ్చేలోపల ఈ పారిన నీరు పూర్తిగా ఎండిపోవడంతో తిరిగి మొదటినుంచీ పారగట్టాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. ఇలా కోతలుపోను, కేవలం 4 గంటలపాటే కరెంటు ఉంటోందని చెబుతున్నారు. కోతలవల్ల కొరత పడిన కరెంటును అర్ధరాత్రి ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. అప్పుడూ కరెంటు దైవాధీనమేనట. ఇక, ఏనుగుల భయంతో రైతులు రాత్రిళ్ల చేలల్లోకి వెళ్లడంలేదు. చాలామంది రైతులు పొలాలను బీళ్లు పెట్టుకుంటుంటే, ఇంకొందరు సేద్యం మానేసి కూలీలుగా, పశువుల కాపరులుగా మారిపోతున్నారు.

'భరోసా' ఉత్తిదే

● **తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో..** కుప్పంలోని హార్టికల్చర్ హబ్‌లో రైతులకు టమోటా, మిర్చి నార్లు ఉచితంగా పంపిణీ చేసేవారు. అరటితో పాటు బీన్స్, చిక్కుడు వంటి పందిరి తోటలకు ఎకరాకు 30 శాతం రాయితీ అందించేవారు. రొటేవేటర్లు, ట్రాక్టర్లు క్రాప్ కట్టర్స్, టార్పాలిన్లు వంటి వాటికి గరిష్ఠంగా 60 శాతం సబ్సిడీ అందేది. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులనూ సబ్సిడీపై ఇచ్చేవారు. పట్టుపురుగుల షెడ్లకు, పెంపకానికి తగిన ప్రోత్సాహకాలు ఉండేవి. డ్రిప్‌లకు 90 శాతం సబ్సిడీ ఉండేది.

● **వైసీపీ హయాంలో..** ఊరూరా రైతు భరోసా కేంద్రాలు పెట్టడం తప్ప జగన్ పాలనలో సబ్సిడీలు అందలేదు. సుమారు రెండున్నరేళ్ల క్రితం డ్రిప్‌లకు సబ్సిడీ ఇచ్చారు కానీ, తర్వాత అది కూడా ఆగిపోయింది. తప్పదారి ఎప్పుడైనా ఎరువుల పంపిణీ జరిగినా, అవి అధికార పార్టీ నాయకులకు తప్ప సామాన్య రైతులకు అందడంలేదు. బైవోల్టీన్ పట్టుగూళ్లకు పట్టు పరిశ్రమ శాఖ ద్వారా కిలోకు రూ.50 వంతున టీడీపీ హయాంలో ఇచ్చిన ప్రోత్సాహం ఇప్పుడు లేదు. అంటే రైతును జగన్ ప్రభుత్వం అనాథగా వదిలేసింది.



కరెంటుతో ఏగలేకే బీడు పెట్టేసినా

ఇదిగో చూస్తావుండారు గదా. ఇదంతా నా పొలమే. మొత్తం రెండెకరాలు. ఏసిన డ్రిప్ పైపులు పీకేసి బీడు పెట్టేసినా. ల్యాకపోతే ఏంది? కరంటు ఎప్పుడు వొస్తాదో, ఎప్పుడు పోతాదో తెలీదు. వొచ్చినా సుద్దంగా ఒక కాలుగంట నిలవదు. ఇంగ ఎక్కడ పంటకు నీల్లు పారతాయి. అప్పులు పెరిగిపొయ్యినాయా సామీ. అందుకే బీడు పెట్టేసి, రొండుమూడు ఆవులు పట్టుకోని సాకతా ఉండా. ఓటికి గెడ్డి దొరకడం గూడా కష్టమైపోతా వుండాది.

- గురుమూర్తి, చందం, కుప్పం మండలం



కళ్లల్లో నీళ్లు తిరగతావుండాయి

నాకు రెండున్నరెకరాల పొలం. అందులోనే మల్బరీ, రాగులు, పశువుల గడ్డి ఏసుకున్నా. బోర్లో నీల్లుండాది. కానీ పారగట్టేకి కరంటుడల్ల గదా. ఇదిగో.. ఈ గెడ్డి మొక్కలు నిలవనా ఎండిపోతా వుండాయి. నేను ఆరేడు పశువులు పెంచుకుంటా వుండా. ఓటికి మేత దక్కడంలేదు. ఏరేవోల్ల దగ్గర గెడ్డి కొనుక్కోనొచ్చి ఏస్తావుండా. మల్బరీ, రాగి వంటి పంటలకు అప్పట్లో సబ్సిడీలు ఇచ్చేవోళ్లు, పంట నష్టపోతే నష్టపరిహారమూ అందేది. ఇప్పుడటువంటివేమీ లేదు. కనీసం ఎరువులు, పురుగుమందులు కూడా ఇయ్యడంలేదు.

- ఎం.కృష్ణప్ప, అగరం, గుడుపల్లె మండలం

కలికానికీ కనిపించని రైతు 'భరోసా'

● ఆగిన సబ్సిడీలు, విద్యుత్తు కోతలతో అన్నదాత సతమతం

● తమిళనాడు, కర్ణాటకల్లో ప్రభుత్వ ప్రోత్సాహంతో పండగలా మారిన వ్యవసాయం

తమిళనాడు: చేలు పచ్చగా..



తమిళనాడు రాష్ట్రం చిగురుమాకులపల్లెలో కళకళలాడుతున్న రైతు స్వీట్‌కార్న్ తోట

గుడుపల్లె మండలం ఓఎన్ కొత్తూరుకు సుమారు నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమిళనాడు రాష్ట్రం వేపనపల్లె పంచాయతీలోని చిగురుమాకులపల్లెను పరిశీలిద్దాం. ఇక్కడ వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు సరఫరా అవుతోంది. బోర్ల నుంచి నీటిని పారిస్తున్నారు. దీంతో ఎటు చూసినా చేలు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. ఈ ఒక్క గ్రామమే కాదు.. తమిళనాడు రాష్ట్రంలో ఏ పల్లెలోనైనా వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తును అక్కడి ప్రభుత్వం సరఫరా చేస్తున్నట్లు అక్కడి రైతులు ఆనందంగా చెప్పారు. పంట సబ్సిడీలు, నష్టపరిహారాలు, ప్రోత్సాహకాలు, సబ్సిడీమీద వ్యవసాయ పరికరాలు తమకు పుష్కలంగా అందుతున్నాయని తెలిపారు.



కరెంటుకు కోతలంటే మాకు తెలీదు

మాకు కరెంటు కోతలంటే ఏందో తెలియదు. రోజులో ఎప్పుడు మోటారు వేసినా రన్ అవుతుంది. అందుకే నాకున్న ఆరెకరాల్లో అరటి, టమోటో, స్వీట్ కార్న్ పండిస్తున్నా. కరెంటు లేకుండా పంటలు ఎండిపోవడమన్నది మేము ఇంతదాకా చూడలేదు. పంటలకు సబ్సిడీలు కూడా మా ప్రభుత్వం బాగానే ఇస్తోంది.

- పెద్దన్న, చిగురుమాకులపల్లె గ్రామం, తమిళనాడు రాష్ట్రం

కర్ణాటక: రైతు మోములో నవ్వులు



బెండవారంలో కళకళలాడుతున్న బీన్స్ తోట

ఇక, కుప్పం నియోజకవర్గానికి పొరుగున ఉన్న ఇంకో రాష్ట్రం కర్ణాటక విషయానికి వస్తే.. అక్కడా ప్రభుత్వంఅనేక రకాలుగా రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. రాగి, టమోటా, మామిడి, వేరుశనగ, అరటి పంటలకు ఎకరాకు రూ.40 వేల దాకా సబ్సిడీ ఇస్తున్నారు. ఏడాదికి రూ.1250 బీమా ప్రీమియం కడితే, ఆయా పంటలకు ప్రకృతి విపత్తులతో జరిగిన నష్టాన్ని బట్టి రూ.30 వేలనుంచి రూ.60 వేలదాకా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తోంది. వ్యవసాయ పరికరాల కొనుగోళ్లకు ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, బీసీ, ఓసీలైతే 75 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. పురుగు మందుల మీద ఏకంగా 80 శాతం సబ్సిడీ లభిస్తోంది. బస్తా యూరియా మీద 10 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. కందులు, రాగులు వంటి చిరుధాన్యాలకూ సబ్సిడీ లభిస్తోంది. ఇక వ్యవసాయానికి కరెంటు సరఫరా కూడా సంతృప్తికరంగానే ఉంది. ఇక్కడ వ్యవసాయానికి రెండు షిఫ్టుల్లో 7 గంటల కరెంటు ఇస్తున్నారు. కాకుంటే, కోతల్లేకుండా పగలు 3 గంటలు, రాత్రి 4 గంటలపాటు సరఫరా అవుతున్నట్లు రైతులు తెలిపారు.

మాకు సబ్సిడీలు బాగా ఇస్తారు

నేను రెండెకరాల అరటి తోట పెట్టాను. ప్రభుత్వంనుంచి ఎకరాకు రూ.30 వేలు సబ్సిడీ లభించింది. ఇంతేకాదు.. పురుగు మందులు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు కూడా సబ్సిడీమీద గవర్నమెంట్ ఇస్తోంది. ఇప్పుడు ఎండలు ఎక్కువగా ఉన్నాయి. కరెంటు బాగానే ఉండడంవల్ల నీటి సమస్య అంతగా లేదు. ఒకవేళ బోర్లో నీళ్లు ఎండిపోయి, పంట ఎండిపోతే.. ఇన్సూరెన్స్ కట్టాను కాబట్టి ఎకరాకు కనీసం రూ.30 వేల నష్టపరిహారం అందుతుంది.



- రమేశ్, రైతు, బెండవారం, కర్ణాటక రాష్ట్రం

టీడీపీ ప్రచారంలో ఎన్ఆర్ఐ

● నేను సైతం

రాష్ట్రాభివృద్ధి కోసం ఆలోచించే చంద్రబాబును ఆదర్శంగా తీసుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు యువ ఎన్ఆర్ఐ గుడివాడ చరణ్. బంగారుపాళ్యం మండలం శేషాపురానికి చెందిన ఈయన 2017లో అమెరికా వెళ్లారు. వాషింగ్టన్‌లో కన్సల్టెన్సీని నెలకొల్పి వంద మందికిపైగా ఉపాధి కల్పిస్తున్నారు. వందల కోట్ల టర్నోవర్ ఉంది. మరోవైపు సొంత మండలంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేద కుటుంబాల్లో పెళ్లిళ్ల జరిగినప్పుడు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల చదువులకు ఆర్థికసాయం చేస్తున్నారు. పేదలు చనిపోతే దహన సంస్కారాలకు ఆర్థికంగా తోడ్పాటునిస్తున్నారు. చంద్రబాబు స్ఫూర్తితో టీడీపీలోకి వచ్చిన ఆయన పూతలపట్టు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రస్తుతం పూతలపట్టు నియోజకవర్గ ఎన్ఆర్ఐ కో- ఆర్డినేటర్‌గా ఉన్నారు. విదేశాల్లో నెల రోజులుంటే నియోజకవర్గంలో నెల ఉండి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మురళీమోహన్, దగ్గుమళ్ల ప్రసాదరావు విజయానికి ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు సీఎం అయితే ఇక్కడే సాఫ్ట్‌వేర్ కంపెనీని నిర్మించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని చరణ్ తెలిపారు.



పాలేరులో ప్రచారం చేస్తున్న ఎన్ఆర్ఐ గుడివాడ చరణ్

- బంగారుపాళ్యం

డిగ్రీ కాలేజీకి భవనాలేవీ?

● ఉదయం ఇంటర్.. మధ్యాహ్నం డిగ్రీ తరగతులు

జీడీనెల్లూరు నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తా.

- ప్రజాసంకల్ప యాత్ర సందర్భంగా వెదురుకుప్పం మండలంలో జరిగిన రోడ్‌షోలో జగన్ ఇచ్చిన హామీ.

చెవిలో పువ్వు

ఆ మేరకు నాలుగేళ్ల కిందట వెదురుకుప్పం మండలం చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలికం పేరుతో డిగ్రీ తరగతులు ప్రారంభించారు. ఉదయం జూనియర్ కళాశాల, మధ్యాహ్నం డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు. నాలుగేళ్ల కిందటే డిగ్రీ కాలేజీ నిర్మాణానికి కొమ్మరగుంట రెవెన్యూ పరిధిలో స్థలాన్ని కేటాయించి శిలాఫలకం కూడా వేశారు. నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఉత్తర్వులు కూడా జారీ చేశారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మరింత ఉత్సాహంతో ఇక్కడ వైఎస్సార్ విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు. కానీ.. నాలుగేళ్లయినా పునాది రాయి పడలేదు. ఒంటి పూట నిర్వహణతో ఇక్కడ జూనియర్ కాలేజీ బలహీనపడింది. విద్యార్థుల సంఖ్య బాగా తగ్గిపోయింది. డిగ్రీ కాలేజీని మా ప్రాంగణం నుంచి ఎత్తేయాలని జూనియర్ కాలేజీ వాళ్లు ఫిర్యాదు కూడా చేశారు.

- వెదురుకుప్పం



వెదురుకుప్పం డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో వైఎస్ విగ్రహం

డిక్లరేషన్ పత్రాలు ఇవ్వలేదని ఆందోళన

తంబళ్లపల్లె, ఏప్రిల్ 26: తంబళ్లపల్లె శాసనసభ స్థానానికి తాము సమర్పించిన నామినేషన్లను ఆమోదించినప్పటికీ డిక్లరేషన్ పత్రాలను సాయంత్రం 5 గంటలైనా ఇవ్వలేదని వివిధ పార్టీల అభ్యర్థులు ఆర్వో కార్యాలయం ఎదుట రోడ్డుపై నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంఎన్ చంద్రశేఖరరెడ్డి, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి పీతల అంజలి, ఇండిపెండెంట్ అభ్యర్థి సురేష్, ఎంఎస్ భానుచంద్రారెడ్డి తదితరులు నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఎన్నికల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తమ నామినేషన్లు ఆమోదించినా సకాలంలో అభ్యర్థులకు డిక్లరేషన్ ధ్రువపత్రాలు ఇవ్వక పోవడం ఏంటని ప్రశ్నించారు. దీంతో స్పందించి వెంటనే ఎన్నికల అధికారులు అభ్యర్థులకు డిక్లరేషన్ పత్రాలు ఇవ్వడంతో వారు శాంతించారు.

వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం తగదు

వాల్మీకిపురం, ఏప్రిల్ 26: ప్రతినిత్యం ప్రజలకు అందించే వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం చూపరాదని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ సూచించారు. శుక్రవారం వాల్మీకిపురంలోని నగిరిమడుగు పీహెచ్‌సీలో ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలిస్తూ సిబ్బంది విధుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. విధుల విషయంలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్లు కీర్తి, నయీం, సూపర్ వైజర్లు నాగిరెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్ట్

కలకడ, ఏప్రిల్ 26: అక్రమంగా మద్యం కలిగిఉన్న కేసులో చలపతి అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. బాలయ్యగారిపల్లి పంచాయతీ దేవళంపేటకు చెందిన చలపతిని అరెస్టు చేసి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతను పట్టించుకోని వైసీపీ

రామసముద్రం, ఏప్రిల్ 26: వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్ల పాలనలో నిరుద్యోగుల ఉపాధి కల్పనలో పూర్తిగా విఫలమైందని మదనపల్లె నియోజకవర్గ కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా విమర్శించారు. మండలానికి చెందిన ముగ్గురు యువకులు గురువారం బెంగళూరులో అనుమానాస్పదస్థితిలో మృతి చెందగా వారిలో ఒకరైన పేద్రాజుపల్లెకు చెందిన మృతుడు లోకేష్ అంత్యక్రియలలో షాజహాన్‌బాషా పాల్గొని మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ నియామకాలు చేసి ఉంటే ఇలాంటి ఘటనలు జరిగి ఉండేవి కావని తెలిపారు.

ప్రయాణికులకు ప్రోత్సాహకాలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 26:స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని బి.కొత్తకోట పాయింట్ వద్ద లక్కీడిప్ ద్వారా ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు అందించినట్లు వన్ డిపో మేనేజరు మూరేవెంకటరమణారెడ్డి తెలిపారు. ఇందులో మొదటి బహుమతి గట్టుకు చెందిన వెన్నెలకు, రెండో బహుమతి అంగళ్లకు చెందిన గోపాల్‌కు, మూడో బహుమతి జ్యోత్స్నకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీకి ఆదాయం పెంచడానికి ప్రోత్సహకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు ఉచిత కంటి చికిత్సా శిబిరం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 26: స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో చెన్నై శంకర్ నేత్రాలయా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి చికిత్సా విబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కంటికి సంబం ధించిన వ్యాధిగ్రస్తులు పాల్గొని వైద్య సేవలు పొందవచ్చని పేర్కొన్నారు.

ప్రశాంతంగా నామినేషన్ల పరిశీలన

● మదనపల్లెలో ఐదుగురి నామినేషన్లతోపాటు పీలేరులో మూడు, తంబళ్లపల్లెలో ఏడు నామినేషన్లు తిరస్కరణ

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26: మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఐదుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్ర్కూటిని కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఎన్నికల అబ్జర్వర్లు కవిత మనికేరి, వైభవ్ శుక్లా పర్యవేక్షణలో నామినేషన్లు వేసిన వారితో పాటు, ఇద్దరు ప్రతిపాదకులు హాజరయ్యారు. ఇందులో భాగంగా టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా, వైసీపీ అభ్యర్థి నిస్సార్‌అహ్మద్, కాంగ్రెస్ అభ్యర్థి పవన్‌కుమార్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి నరసింహులు నామినేషన్లు ఆమోదించారు. మిగిలిన వారిలో ఐదుగురు ఇండిపెండెంట్ల నామినేషన్లు ఆమోదించారు. ఇదిలా వుండగా టీడీపీ అభ్యరిగా నామినేషన్ వేసిన గుల్నాజ్‌బేగం, వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మహ్మద్ హసన్, కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన నరేంద్రలు బీ-ఫామ్ సమర్పించకపోవడంతో వారి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వారితో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు ఆకాష్‌కు ఎన్నికల్లో పోటీచేసే వయస్సు 25 ఏళ్లకు తక్కువగా ఉండటం, రెడ్డెప్ప నామినేషన్లతో సాంకేతిక లోపాలు వుండటంతో వారిద్దరి నామినేషన్లు తిరస్కరించారు. దీంతో మొత్తం ఐదుగురి నామినేషన్లు తిరస్కరణకు గురికాగా 14 మంది నామినేషన్లు ఆమోదించారు.

పీలేరులో: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం పీలేరులో జరిగిన అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. పీలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి 15 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. పరిశీలనలో భాగంగా ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తరపున డమ్మీ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసిన ఆయన సతీమణి నల్లారి తనూజా రెడ్డి, కుమారుడు నల్లారి అమరనాథరెడ్డి, వైసీపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి తరపున డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఆయన సతీమణి చింతల నీరజమ్మ నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. ఆయా పార్టీల తరఫున బీ.ఫారాలు పొందిన ప్రధాన అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందినట్లు అధికారులు తెలిపారు. తిరస్కరణ తరువాత పీలేరు బరిలో 12 మంది అభ్యర్థులు మిగిలారు. వారిలో ప్రధాన పార్టీలైన తెలుగుదేశం తరపున నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, వైసీపీ తరపున చింతల రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ తరపున బాలిరెడ్డి సోమశేఖరరెడ్డి, బహుజన సమజ్ పార్టీ తరపున ఎంసీ వెంకటరమణతోపాటు మరో 8 మంది స్వతంత్ర్య అభ్యర్థులు మిగిలారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29వ వరకు గడువు ఉంది. 2014, 2019 ఎన్నికల సందర్భంగా వైసీపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి నామినేషన్‌పై పుకార్లు వ్యాపించి కాసింత ఉత్కంఠకు దారితీసిన ఉదంతాలు ఉండడంతో ఈ దఫా పోలీసులు నామినేషన్ల పరిశీలనలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



స్ర్కూటినిలో నామినేషన్లు పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్, అబ్జర్వర్ కవిత

తంబళ్లపల్లెలో: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం తంబళ్లపల్లె రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్వో రాఘవేంద్ర ఆధ్వర్యంలో నామినేషన్ పత్రాల పరిశీలన జరిగింది. వాటిలో 12 మంది అభ్యర్థుల నామినేషన్లు సరిగ్గా ఉన్నట్లు గుర్తించి ఆమోదించగా..7 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఆమోదించిన నామినేషన్లలో టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి, వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారక నాథరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎన్ చంద్రశేఖరరెడ్డి, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి పీతల అంజలి, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి కందుకూరి సుజాత, జాతీయ జనసేన అభ్యర్థి డి.జయచంద్రారెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు గుండాల క్రిష్టప్ప, వై ద్వారకనాథరెడ్డి, ఎన్.నరసింహులు, ఎంఎస్ భానుచంద్రారెడ్డి, పీపీ వెంకటరెడ్డి, ఎం.సురేష్ నామినేషన్ల దరఖాస్తులు ఆమోదించినట్లు ఆర్వో తెలిపారు.

శ్రీజ్ఞానాంబిక కళాశాలకు అటానమస్ హోదా

● యూజీసీ నుంచి ఉత్తర్వులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26: మదనపల్లెలోని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళా శాలకు అటానమస్ హోదా కల్పిస్తూ యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని కళాశాల కరస్పాండెంట్ ఆర్. గురుప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు గతేడాది న్యాక్ ఏ ప్లస్(3.46 ఎన్‌జీ పీఏ) గుర్తింపు వచ్చిందన్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం యూ జీసీ తమ కళాశాల అర్హతను గుర్తించి అటానమస్ హోదా(స్వయంప్ర తిపత్తి) కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ హోదాతో స్వేచ్ఛగా, స్వతం త్ర్యంగా పనిచేస్తామని పాఠ్యాంశాల సిలబస్, ఆర్థిక వనరులు, పరీక్షల నిర్వహణ, బోధన, రోజు వారి కార్యక్రమాలన్నింటి తమ కళా శాల ఆధ్వర్యంలోనే జరుగుతాయన్నారు. ఎస్వీ యూనివర్సిటి పరిధిలో తొలిసారిగా ప్రైవేటు డిగ్రీ కళాశాలగా తమకు అటానమస్ హోదా దక్కడం గర్వకారణంగా వుందన్నారు. ఈ హోదాతో మరింత బాధ్య తగా పనిచేస్తామన్నారు. ప్రపంచీకరణకు అనుగుణంగా నిర్దేశించిన సమయంలో సిలబస్ పూర్తి చేసి, పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం బీటీ కళాశాల రిటైర్డ్ అధ్యాపకులు మల్లికార్జున, శివప్రసాద్‌లు కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవిని పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు.



కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న రిటైర్డ్ అధ్యాపకులు

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26: అప్పుల్లో కూరుకుపోయిన ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోళ్లబైలు-2 పంచాయతీలో షాజహాన్‌బాషా ఎన్నికల ప్రచారం సందర్భంగా వెంకటేశ్వరపురంకు చెందిన వైసీపీ ఉపసర్పంచ్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో 100 కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో బోయపాటి రామ్మూర్తి, హరీష్, శివ, జయరామ్, మంగేనాయక్, సాంబశివ, అనూరాధ, సుకన్న, అశ్విని, ప్రసన్న పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు కవిత

తంబళ్లపల్లె, ఏప్రిల్ 26: తంబళ్లపల్లె మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు కవిత మన్నికేరి శుక్రవారం పరిశీలించారు. స్థానిక జూనియర్ కాలేజిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లకు సౌకర్యాలు తదితర అం శాలపై పలు సూచనలు చేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా ఏవైనా సమస్యలు తలెత్తితే ఫోన్ నెం:8977949222కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు బ్రహ్మయ్య, ఎన్నికల అధికారులు, ఎస్ఐ శివకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో: ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు ఎన్నికల పరిశీలకురాలు కవిత పేర్కొన్నారు. శుక్రవారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూములను ఆమె పరిశీలించారు. ఎటువంటి లోటుపాట్లు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అంగళ్ళు పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

వైసీపీ యువనేత రూపేష్‌రెడ్డి టీడీపీలో చేరిక

రామసముద్రం, ఏప్రిల్ 26: మదనపల్లె నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా సమక్షంలో శుక్రవారం మండలంలోని మాలేనత్తం గ్రామానికి చెందిన యువ వైసీపీ నాయకుడు రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి షాజహాన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈకార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, శ్రీనాథ్, శ్రీనివాస్‌గౌడు, కృష్ణంరాజు, క్రిష్టప్ప, రమేష్, జావీద్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

సిద్దవటం, ఏప్రిల్ 26: సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామ పంచాయతీ, రామకృష్ణాపురం, వెంకటేశ్వరపురంలో రెండు వారాలుగా తాగునీరు రావడం లేదంటూ శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. వేసవి కాలంలో తాగునీరు అందించకపోతే ఎలా బతకాలని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని మహిళలు కోరారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనరసయ్యను వివరణ కోరగా వేసవి కావడంతో నీటి శాతం గణనీయంగా పడిపోయిందని, పెన్నా నుంచి వచ్చే మంచినీటి పైపులు డ్యామేజీ అయ్యాయని, ట్యాంకర్లతో నీరు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కూటమిని గెలిపించాలి

నిమ్మనపల్లి, ఏప్రిల్ 26: ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని గెలిపించాలని మదనపల్లె కూటమి అభ్యర్థి పాజహాన్‌బాషా తనయుడు జునైద్ అక్బరీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులతో ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషాను, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలి పించాలని కోరారు.

మద్యం దుకాణాలపై ప్రత్యేక నిఘా..

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 26: ప్రభుత్వ మద్యం దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ నోడల్ అధికారి చంద్రనాయక్ తెలిపారు. శుక్రవారం నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. స్టాకు పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ జయసింహ, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టరు రామక్రిష్ణ శాస్త్రి, ఇన్‌స్పెక్టరు గాయత్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలు అణగదొక్కేందుకే మళ్లీ వచ్చా

● ఉమ్మడి కూటమి పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి



కమ్మసంఘం ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 26: రాష్ట్రంలో వైసీపీ అరాచకాలు, జిల్లాలో పెద్దిరెడ్డి కుంటుబీకుల అవినీతి అణగదొక్కేందుకే తాను మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని ఉమ్మడి కూటమి పార్లమెంట్ అభ్యర్థి, మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రైవేటు కళ్యాణమండపంలో కమ్మసంఘం ఆత్మీయ సమావేశంలో కిరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాజకీయాల్లో ప్రతి ఒక్కరు హుందాతనం పాటించాలని, వ్యక్తిత్వ హననం చేయకూడదన్నారు. 30 ఏళ్ల రాజకీయంలో తాను చంద్రబాబుతో కలసి బహిరంగ సభలో పాల్గొన్నాని, తనకు చాలా సంతోషంగా వుందన్నారు. వైసీపీ పాలనలోని రౌడీయిజం, అక్రమ కేసులు పోవాలంటే చంద్రబాబును సీఎం చేయాలని, ప్రధాన మంత్రిగా మోదీని ఎన్నుకోవాల్సిన అవసరం వుందన్నారు. ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, జనసేన నాయకుడు శ్రీరామ రామాంజనేయులు, కమ్మసంఘం నాయకులు రాటకొండ బాబురెడ్డి, ఆనంద్, మార్పురి సుధాకర్‌నాయుడు, మిట్స్ విజయభాస్కర్‌చౌదరి, ద్వారకనాథ్, విద్యాసాగర్, గురుప్రసాద్, గంగారపు గౌతంరెడ్డి, కట్టా దొరస్వామినాయుడు, కమ్మయూత్ పెరవలి నవీన్, నిరంజన్‌నాని, బోయపాటి రాణా పాల్గొన్నారు. మదనపల్లె మండలం సీటీ ఎంలో మాజీ సీఎం కిరణ్‌కుమారొడ్డికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు.

టీడీపీ వస్తేనే రాష్ట్రం సుభిక్షం



బసినికొండలో ఇంటింటా ప్రచారం చేస్తున్న టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి

మదనపల్లె, ఏప్రిల్ 26: టీడీపీ అధికారంలోకి రావడం ద్వారానే రాష్ట్రం అన్ని విధాలా సుభిక్షంగా ఉంటుందని టీడీపీ సీనియర్ నేత గంగారపు బాబురెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం లో భాగంగా శుక్రవారం మండలంలోని బసిని కొండ పంచాయతీ రింగురోడ్డు, అంబేడ్కర్‌కాలనీ, మసీదురోడ్డు ఏరియాలలో కార్యకర్తలతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటా వివరిస్తూ, కరపత్రాలు అందజేశారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా, ఎంపీ అభ్యర్థి ఎన్.కిరణ్‌కు మార్‌రెడ్డికి వేసేలా ప్రజల్లో చైతన్యం తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కత్తి లక్ష్మన్న, నటశేఖర్, సంద్ర నారాయణస్వామి, రమేష్, బాలప్పగారి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన



ప్రదర్శనలో హస్త కళావస్తువులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 26: మదనపల్లె పట్టణం లోని గాంధీరోడ్డు మిషన్ కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలను ఆక ట్టుకొంటోంది. చేనేత కళాకారులు రూపొందించిన కళంకారీ చీరలు, కళంకారీ వస్త్రాలు, బ్యాంగిల్స్, కళంకారీ డ్రస్‌మె టీరియల్స్, ఖాదీ షర్టులు, జైపూర్ బెడ్‌సీట్స్, మైసూర్ పెయింటింగ్స్, తదితర గిఫ్ట్ ఐటమ్స్, ఈప్రదర్శనలో లభిస్తాయి. ఈ ప్రదర్శన ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉం టుందని మేనేజరు వై. వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కళాకారులచే తయా రు చేసిన వస్త్రాలను కొనుగోలు చేసి కళాకారులను ఆదరించాలని, వారికి చేయూత అందివ్వాలని కోరారు. ఈ ప్రదర్శనలో 50 వేల రకాల వస్తువులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సెలవు రోజుల్లో కూడా విక్రయాలు ఉంటాయని తెలిపారు.

నేడు మండల సమావేశం

కలకడ, ఏప్రిల్ 26 : కలకడ మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10-30 గంటలకు జరుతుందని ఎంపీడీవో పరమే శ్వరరెడ్డి తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఆయన కోరారు.

కూటమిని గెలిపించండి..అభివృద్ధికి పాటుపడతాం



ములకలచెరువులో ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి



బి.కొత్తకోట సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు/ బి.కొత్తకోట, ఏప్రిల్ 26: తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డిని ఎన్నికల్లో గెలిపిస్తే అభివృద్ధికి పాటుపడతామని జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి పేర్కొన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధాతో కలిసి ములకలచెరువులోని పలు వీధుల్లో ఇంటింటికి వెళ్లి తన భర్త జయచంద్రారెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ములకలచెరువులోని టమోటా మండీల్లో నిర్వహించిన ప్రచారంలో మహిళలు, కూలీల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. అలాగే బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ పథకాలైన సూపర్ సిక్స్‌పై వివరించారు. నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నేతలు కేశవులు, కట్టా హరి, నాయకులు సోము, విజయ్, శివకుమార్, నాగేంద్ర, ప్రతాప్ మధు, రవి, కుళాయప్ప, సయ్యద్‌అలీ, సైఫుల్లా, గౌతమ్‌యాదవ్, మహేష్, అన్వర్‌బాషా, నన్నేసాబ్, మాలిక్, ఇమాంబాషా, సూరి పాల్గొన్నారు. ఎన్నికలలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని గెలిపిస్తే అభివృద్ధికి అన్ని విధాల పాటుపడతామని తంబళ్లపల్లె నియోజకవర్గ కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బి కొత్తకోట మండలంలోని గట్టు గ్రామంలో మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సొంత చెల్లెళ్లకే న్యాయం చేయని సీఎం జగన్ రాష్ట్ర మహిళల కు ఏం న్యాయం చేస్తాడని విమర్శించారు. డ్వాక్రా సంఘాలకు పునాది వేసింది టీడీపీ యేనని గుర్తు చేశారు. అనంతరం టీడీపీ ముద్రించిన సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, పార్టీ సమన్వయకర్త మల్లికార్జున నాయుడు, మండలపార్టీ కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, నాయకులు కుడుం శ్రీనివాసులు, మొటుకుశివ, రెడ్డెప్ప, గట్టుఅంజి, శ్రీనివాసులురెడ్డి, ఆనందరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యంతో పయనించాలి



ఆకట్టుకున్న విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

కురబలకోట, ఏప్రిల్ 26: విద్యార్థులు నిర్ధిష్ట లక్ష్యంతో ముందుకు సాగాలని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరెస్పాండెంట్ ఎస్.విజయభాస్కర్ చౌదరి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న టెక్నోకల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ అశ్వ-2కె24 శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా కల్చరల్ స్పోర్ట్స్, వర్క్‌షాప్‌లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కాగా శుక్రవారం రాత్రి సినీనటుడు నిఖిల్ విద్యార్థులతో డాన్సులు చేసి అలరించాడు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అకాడమి ప్రెసిడెంట్ నాదెళ్ళ ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రచారం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 26: స్థానిక బెంగళూరు బస్టాండ్‌లో తన అనుచరులతో కలిసి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. అలాగే ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగా లంటే కాంగ్రెస్ పార్టీ అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పుంగనూరు కన్వనర్ సింగం రామకృష్ణారెడ్డి, మదనపల్లె నియోజక వర్గ నాయకుడు ఎస్‌రెడ్డిసాహెబ్, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాషా, మల్లెలనరేంద్ర, మహబూబ్‌పీర్, సయ్యద్, మహమ్మద్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం



ఇంటింటి ప్రచారం చేస్తూ ఓటర్లను అభ్యర్థిస్తున్న నల్లారి తనూజారెడ్డి



ఇంతియాజ్‌అహ్మద్‌తో మాట్లాడుతున్న నల్లారి తనూజారెడ్డి

వాల్మీకిపురం, ఏప్రిల్ 26:కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పీలేరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వాల్మీకిపురం పట్టణంలోని నల్లవీరగంగాభవాని ఆలయంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం గంగమ్మగుడివీధి, ఫింగాణిఫ్యాక్టరి, నమాజ్‌కట్టవీధి, ఏపీవై కాలనీ, రామ్‌నగర్ తదితర ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం చేస్తూ ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలో నల్లారి తనూజారెడ్డి ప్రచార కార్యక్రమానికి మహిళలు హారతులు పట్టగా గజమాలలతో నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఘనస్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజలతో ఉంటూ నిస్వార్థ సేవకులైన నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యేగా, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపిం చాలని కోరారు. నియోజకవర్గంలో నల్లారి కుటుంబం నిత్యం అభివృద్ధి, ప్రజా సంక్షేమమే పరమావధిగా పాటుపడితే గడిచిన ఐదేళ్లలో అవినీతి వైసీపీ ప్రభుత్వం అరాచకాలు, అక్రమ కేసులతో కొనసాగిందే తప్ప ప్రజల కు ఒరిగింది శూన్యమన్నారు. కూటమి మేనిఫెస్టోలో పొందుపరిచి న సంక్షేమ పథకాలను ఇంటింటా వివరిస్తూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. నల్లారి తనూజారెడ్డి ప్రచారంలో పార్టీ ప్రచార వాహనాలు ప్రత్యేకార్షణగా నిలిచాయి.ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బెజవాడ దినేష్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లె మధు, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు కృష్ణారెడ్డి, పివీ నారాయణ, రాజేంద్రాచారి, చంద్రమౌళి, కోసూరిరమేష్, వల్లిగట్ల వెంకటరమణ, ద్వారకనాథరెడ్డి, శేషాద్రిరెడ్డి, మురళి, మద్దెల గిరిబాబు, కువైట్ సయ్యద్‌బాషా, సుధాకర్‌రెడ్డి, గుడ్రెడ్డి చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, డిష్ బ్రదర్స్, జయకృష్ణ, తెలుగు యువత చాను, న్యాయవాది రమణ, కువైట్ ఆది, ఆనంద్, ఎండీ యూసుఫ్, కువైట్ బాబు, కేకేనాయుడు, హనీఫ్, సైదు, గాం ధీపేట రెడ్డి, స్వర్ణలత, జావీద్, గంగులప్ప, రెడ్డెప్ప, ఆదినారాయణ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కాగా నల్లారి తనూజారెడ్డి పట్టణంలోని కొత్తపేటవీధిలో నివాసం ఉంటున్న సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ డాక్టర్ షేక్ ఇంతియాజ్ అహ్మద్ ఇంటికి వెళ్లి ఆయనతో సుమారు అరగంట పాటు చర్చించారు.

పీలేరులో ఉధృతంగా టీడీపీ శ్రేణుల ప్రచారం

పీలేరు, ఏప్రిల్ 26: పీలేరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి విజయం కోసం పీలేరు పట్టణంలోని టీడీపీ శ్రేణులు ఉధృతంగా ప్రచారం చేస్తున్నారు. నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి, కూతురు వైష్ణవి రెడ్డి, కోడలు నల్లారి షమా రెడ్డి రెండు రోజుల క్రి తం వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారి రాకతో స్థానిక శ్రేణుల్లో జోష్ నింపింది.కాగా శుక్రవారం పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీ, కడప రోడ్డు, జెండా మాను, రాజీవ్ నగర్ కాలనీ, కోటపల్లె ప్రాంతాల్లో స్థానిక నాయకులు ప్రచారం నిర్వహించారు.